ప్రతి ఇంటికి కొళాయి కనెక్షన్


- జల్ జీవన్ లక్ష్యాన్ని సంపూర్తిగా సాధించాలి
- కలెక్టర్ లోతేటి శివశంకర్



మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

కడప(కలెక్టరేట్), సెప్టెంబరు 10: జల్‌జీవన్ మిషన్ లక్ష్య సాధనలో భాగంగా ప్రతి ఇంటికి తాగునీటి కొళాయి కనెక్షన్ సదుపాయం కల్పించడంతో పాటు వంద శాతం కనెక్షన్లను నిర్వహణలోకి తీసుకురావాలని కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జల్‌జీవన్ మిషన్ ద్వారా జిల్లాలో అమలవుతున్న శుద్ధ తాగునీటి సరఫరా పనుల పురోగతిపై ఆయా గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్యశాఖ ఇంజనీరింగ్ అధికారులు, సహాయకులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికి కొళాయి కనెక్షన్లు వందశాతం పూర్తి లక్ష్యాలను సాధించాలన్నారు. గ్రామ పంచాయతీల్లో తాగునీటి పథకాల అమలు, పనితీరును మెరుగుపరిచేందుకు క్రమం తప్పకుండా తాగునీటి నాణ్యత పరీక్షలను క్షేత్రస్థాయి ఇంజనీరింగ్ అధికారులు నిర్వహించాలన్నారు. పంచా యతీల్లో క్లోరినేషన్ సిస్టమ్‌ను, ఎఫ్‌టీకే పనితీరు, నాణ్యతను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. తాగునీటి సరఫరా, డ్రైనేజీ సిస్టమ్ ప్రణాళికను పటిష్టంగా అమలు పరచాలని సూచించారు. పీడబ్ల్యుఎస్, ఎంపీడబ్ల్యుఎస్, సీపీడబ్ల్యుఎస్ స్కీముల నిర్వహణను పటిష్టం చేయాలన్నారు. తాగునీటి కొళాయి కనెక్షన్ల పైపులైన్లలో లీకేజీలు ఉండకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. వీటిపై సచివాలయం పరిధిలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో సుధాకర్ రెడ్డి, సీపీవో వెంకట్రావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ ఏడుకొండలు, ఈఈలు, డీఈలతో పాటు అన్ని మండలాల ఏఈఈలు పాల్గొన్నారు.

సమన్వయంతో విద్యాప్రమాణాలు పెరుగుదల



మాట్లాడుతున్న జిల్లా నోడల్ అధికారి మధుసూదనరావు

- యూడైస్‌కు అధిక ప్రాధాన్యత
- బడిబయట పిల్లలను ఎప్పటికప్పుడు బడిలో చేర్పించాలి
- జిల్లా నోడల్ అధికారి మధుసూదనరావు

కడప(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 10: అంద సమన్వయంతో విద్యాప్రమాణాలు పెంచాలని విద్యాశాఖ జిల్లా నోడల్ అధికారి, కేజీబీవీ సెక్రటరీ మధుసూదనరావు తెలిపారు. యూడైస్‌కు అధిక ప్రాధాన్యత కల్పించాలని.. బడి బయట పిల్లలను ఎప్పటికప్పుడు బడిలో చేర్పిచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సభాభవనంలో కడప, అన్నమయ్య జిల్లాల విద్యాశాఖాధికారులతో ఒక్కరోజు శిక్షణను డీఈవో అనురాధ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుకోవాలనే లక్ష్యంతో విద్యహక్కు చట్టం ప్రకారం పాఠశాలలో చేర్పించాలన్నారు. విద్యార్థులందరికీ విద్యకు సంబంధించిన వసతులు కల్పించడంలో, నాణ్యమైన విద్యనందించడంలో విద్యాహక్కు చట్టం ప్రకారం వసతులు సమకూర్చే విధంగా చూడాలన్నారు. ఉపవిద్యాధికారులు, ఎంఈవోలు తమ పరిధిలో కార్యాలయ సిబ్బందితో విద్యాసంబంధ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని.. అందుకు సంబంధించిన రిపోర్టులు జిల్లా కార్యాలయానికి పంపించాలన్నారు. ఆర్టీఏ ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్యకు ఎంపికైన విద్యార్థులను తప్పనిసరిగా అడ్మిషన్లు ఇవ్వాలని.. లేనిపక్షంలో ఆయా పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాలిక విద్య పెంపొందించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కేజీబీవీలను ఏర్పాటు చేయడంతో బాలిక విద్య అక్షరాస్యత గణనీయంగా పెరిగిందన్నారు. అనంతరం కడప డీఈవో అనురాధ, అన్నమయ్య డీఈవో ప్రకాశ్‌రెడ్డి ఆయా జిల్లాల్లో విద్యాపరమైన ప్రగతిని తెలుపుతూ.. విద్యాభివృద్ధికి కృషి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో కడప, ప్రొద్దుటూరు, మదనపల్లె ఉప విద్యాధికారులు రాజగోపాల్‌రెడ్డి, క్రిష్టఫర్, పురుషోత్తం, కడప డీఈవో కార్యాలయం ఏడీ మునీర్‌ఖాన్, అన్నమయ్య జిల్లా ఏడీ ప్రసాదరావు, బుక్ మేనేజరు రామానుజదేవి, ఎంఈవోలు సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

క్రికెట్ ఓ మాఫియా

కడపకు దేశంలోనే గుర్తింపు ఉంది. కవులు కళాకారులే కాదు.. ఫ్యాక్షన్, సహజసిద్ధమైన వనరులు ఇలా అన్నింటికీ పెట్టింది పేరు. గేమ్స్‌లోనూ కడపకు ఓ ప్రత్యేకత ఉంది. అలాంటి కడప గడ్డలో జెంటిల్‌మెన్ గేమ్‌గా ఉన్న క్రికెట్‌ను ఓ బ్యాచ్ మాఫియాగా మార్చేసిందంటారు. జిల్లాలో ప్రతిభ గల క్రీడాకారులకు కొదవ లేదు. బౌలింగ్, బ్యాటింగ్, కీపింగ్.. దేంట్లో అయినా సత్తా చాటగల మెరికల్లాంటి ఆటగాళ్లు మన వద్ద ఉన్నారు. ఇక్కడ ప్రతిభ ఉన్నా పైసలిచ్చే స్థోమత లేక కొందరు స్టేడియంలోకి అడుగు పెట్టలేకపోతే, మరికొందరు అడుగు పెట్టినా కేవలం రిజర్వు ఆటగాళ్లుగా మారి తోటి టీమ్‌లోకి ప్లేయర్లకు వాటర్ సప్లై చేసే పరిస్థితికి వచ్చేశారు. ఎలాంటి ప్రతిభ లేకున్నా కేవలం అకాడమీలో శిక్షణ, కొందరిని మేనేజ్ చేసి అడ్డగోలుగా గ్రౌండ్‌లోకి వచ్చేస్తున్నారు. కడప జిల్లా క్రికెట్‌ను ఇప్పుడు ఓ మాఫియా నడిపిస్తోందనే చర్చ నడుస్తోంది. న్యాయస్థానాల ఆదేశాలను, నిబంధనలను లెక్క చేయకుండా కడప క్రికెట్‌ను కొందరు అకాడమీ నిర్వాహకులు, స్పోర్ట్స్ కిట్‌లు అమ్మేవారు శాసిస్తూ ప్రతిభ గల క్రీడాకారులను పైకి రాకుండా పాతేస్తుండగా.. అడ్డగోలుగా హైదరాబాదు ఆటగాళ్లు దర్జాగా కడప జిల్లా తరపున ఆడుతూ సెలెక్టర్లకు సవాల్ విసురుతుండటంపై చర్చ నడుస్తోంది.




- కడప టీం సెలక్షన్స్‌లో కలెక్షన్స్
- ప్రతిభతో పనిలేదు
- 'సార్ల' అకాడమీలో శిక్షణ తీసుకుంటే ఒకే
- లేదంటే ఆమ్యామ్యాలు ఉంటే గ్రాండ్‌గా గ్రౌండ్‌లోకి
- న్యాయస్థానం తీర్పుకు విరుద్ధంగా ఇక్కడ కార్యక్రమాలు
- భ్రష్టు పట్టిన కడప క్రికెట్

(కడప-ఆంధ్రజ్యోతి): క్రికెట్ మనోళ్లకు ఓ ఫీవర్ లాంటిది. మ్యాచ్ లైవ్ ఉందంటే చాలు మొబైల్, టీవీల్లో అతుక్కుపోయి వీక్షిస్తుంటారు. ఆడమగ అన్న తేడా లేకుండా అందరికీ బాగా కనెక్ట్ అయిన గేమ్ ఇది. యువకులు ఇప్పుడు చాలామంది క్రికెట్ ఆడేందుకు ఆసక్తి చూపుతున్నారు. క్రికెట్‌లో ప్రతిభ చూపాలని సాధన చేస్తుంటారు. జిల్లా, రాష్ట్రస్థాయి కేటగిరీలో స్థానం సంపాదించాలని రేయింబవళ్లు కష్టపడుతుంటారు. కొన్ని మ్యాచ్‌లు ఆడినా సరే.. స్పోర్ట్స్ కోటాలో మంచి ఉద్యోగాలు పొందవచ్చు. అందుకే ఈ గేమ్ అంటే అందరికీ ఇష్టం. కడపలో చక్కటి స్టేడియం ఉంది. అయితే ఇక్కడ సెలక్షన్స్ తీరే అధ్వాన్నంగా ఉందంటారు. చాలా సినిమాల్లో చూసింటాం.. క్రీడాకారులను లెక్కలతో కొనేది. సేమ్ టు సేమ్ కడప జిల్లా క్రికెట్‌లో కూడా ఇలానే సాగుతోంది. ఇక్కడంతా డబ్బులు, సిఫారసులకే ప్రాధాన్యం ఇస్తూ ఎంపిక చేస్తారనే ప్రచారం ఉంది. క్రికెట్ అకాడమీలో జరుగుతున్న గోల్‌మాల్, మోసాలపై జనాలకు పెద్దగా ఆసక్తి ఉండదు. అక్కడ ఏం జరిగేదీ కొందరికే తెలుస్తుంది. అందుకే పెద్ద ఇష్యూ అయినా కూడా ఇది పెద్దగా బయటికి రావడంలేదు. అక్కడ జరిగే అవినీతిని హైలెట్ చేయకుండా మీడియాను కూడా మేనేజ్ చేస్తున్నారనే ప్రచారం సాగుతోంది.

క్రికెట్ ఆడాలా.. అయితే అకాడమీలో జాయిన్‌కా..

క్రికెట్ టీంకు ఎంపిక కావాలంటే ప్రతిభ అవసరం అనుకుంటారు. ఎన్ని వికెట్లు తీశారు, ఎన్ని పరుగులు చేశారు. ఫీల్డింగ్ చేశారు, వికెట్ కీపింగ్ ఎలా చేశారు, ఎన్ని స్టంప్ అవుట్లు చేశారు అనే వాటిని పరిగణనలోకి తీసుకుని ఎంపిక చేస్తారు. అది మిగతా చోట్ల జరుగుతుందేమో కానీ మనకాడ మాత్రం వాటిని పరిగణనలోకి తీసుకోరని చెబుతారు. ఇక్కడంతా జట్టులోకి రావాలంటే కొందరి చేతులు తడపాల్సిందేనంటారు. ఆ సార్ల అకాడమీలో కోచింగ్ తీసుకుంటే గ్రాండ్‌గా గ్రౌండ్‌లోకి ఎంట్రీ ఇస్తారు. నీవు తెలంగాణ అయినా సరే ఇతను కడపోడు అని చెప్పేసి సర్టిఫికెట్ పుట్టించేసి రెడ్‌కార్పెట్ వేసి టీంలో అవకాశం కల్పిస్తారంటారు. కడప జిల్లా వాళ్లు కడప, హైదరాబాదులో అకాడమీలు ఏర్పాటు చేశారు. అక్కడ రకరకాల శిక్షణ పేరుతో వేలకు వేలు వసూలు చేస్తారు. మిమ్మలను టీంలోకి తీసుకుంటామని చెప్పి భారీగా దోచుకుంటారని చెబుతారు. క్రికెట్ లెజండ్ గేమ్ కావడంతో ధనవంతులు తమ కొడుకులు కూడా మంచి పేరు తెచ్చుకోవాలని ఎంతైనా ఇచ్చేసి ఆ సార్ల కోచింగ్‌లలో జాయిన్ చేస్తారంటారు. అలా శిక్షణ తీసుకున్న వారు ఒక్క మ్యాచ్ ఆడకపోయినా సరే నేరుగా కడప టీంలోకి వచ్చేస్తారంటారు.

నిబంధనల ఉల్లంఘన



2018లో అత్యున్నత న్యాయస్థానం క్రికెట్‌తో సంబంధం ఉన్న మ్యాచ్‌లు ఆడినా, వ్యాపారం చేసినా అలాంటి వారు సెలక్షన్ మెంబర్స్‌గా ఉండకూడదని తీర్పునిచ్చింది. అయితే జిల్లా క్రికెట్‌లో సెలక్షన్ టీం మెంబర్లుగా అకాడమీలు నడిపేవారు, కిట్ల పేరుతో వ్యాపారం చేసేవారు ఉన్నారంటారు. అందుకే ఎంత శిక్షణ తీసుకున్నా సరే.. వారివద్ద కిట్లు కొనుగోలు చేసిన వారికే ప్రాధాన్యం ఇస్తారంటారు. ఒకప్పుడు కడపలో క్రికెట్ ఆడిన వారిలో ఇద్దరు హైదరాబాదులో అకాడమీ ఏర్పాటు చేస్తే, కొందరు కడపలో అకాడమీ ఏర్పాటు చేశారు. ఇక్కడ లక్షలు ఫీజులు తీసుకుని శిక్షణ ఇస్తారంటారు. ధనవంతుల పిల్లలే అక్కడ కోచింగ్‌కు వెళతారు. మిమ్మల్ని కడప జట్టులో ఆడిస్తాం అంటూ హామీ ఇచ్చే తీసుకుంటారంటారు. చెప్పినట్లుగానే అక్కడ వారు క్రికెట్‌లో రాణించకున్నా ఎంపిక చేస్తారంటారు. హైదరాబాదు చెందిన ఇద్దరు బ్రదర్స్‌కు క్రికెట్ అంటే పిచ్చి. వారికి ఆటలో నైపుణ్యం లేదంటారు. కడపతో కనెక్ట్ అయితే అడ్డగోలుగా జట్టులో స్థానం సంపా దించవచ్చని సలహా ఇవ్వడంతో ఆ తల్లిదండ్రులు తొలుత ప్రొద్దుటూరులో సంప్రదించగా వారు తిరస్కరించారు. జిల్లా క్రికెట్ టీమ్‌లో ఉండే ఒకాయనను సంప్ర దించగా ఓ.. ఎస్.. ఇదెంత అని హామీ ఇచ్చారంటారు. ఇటీవల కడప, అనంతపురం మ్యాచ్ అనంతపురంలో జరిగింది. హైదరాబాదు బ్రదర్స్‌లో ఒకరు రిజర్వులో ఉన్నారు. ఎంతో పెట్టాం, మా వాడు ఏంది రిజర్వులో ఉండడం అంటూ తల్లిదండ్రులు సీరియస్ అయి ఆ సారుకు ఫోను చేయగా.. ఆయన వెంటనే స్టార్ట్ అయిన మ్యాచ్‌ను ఆపివేసి రిజర్వు ఆటగాన్ని తీసుకువచ్చి ఆట ఆడించారు. ఇక కడప, చిత్తూరు మధ్య జరిగిన మ్యాచ్‌లో హైదరాబాదు బ్యాచ్‌కు చెందిన ఓ బ్రదర్ అవుట్ అయ్యారంటారు. అయితే ఆయన బయటకి వెళ్లకుండా అక్కడే మంకుపట్టు పడితే మళ్లీ ఆ సారు ఎంట్రీ చేశారంటారు. మ్యాచ్ ఆపినా కూడా ప్రత్యర్థి కెప్టెన్ ఒప్పుకోనని తిరగబడ్డంతో చివరికి హైదరాబాదు బ్రదర్ పెవిలియన్ చేరాడంటారు. జిల్లాలో మంచి ప్రతిభ ఉన్న ఆటగాళ్లు ఉన్నారు. ఇలాంటి వారిని వదిలేసి కట్టలు కట్టలు క్యాష్ ఇచ్చేవారిని ఎంపిక చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల గుజరాత్‌లో రిలయన్స్ కప్ ఆడే మ్యాచ్‌లకు సెలక్షన్స్ జరిగాయి. కడప, కర్నూలు, చిత్తూరు, నెల్లూరుతో పాటు శ్రీకాకుళం, క్రిష్ణా జిల్లాలకు చెందిన మ్యాచ్‌లు మన వద్ద జరిగాయి. శ్రీకాకుళం క్రీడాకారుడు 20 వికెట్లు, క్రిష్ణా జిల్లాకు చెందిన మరో క్రీడాకారుడు 18 వికెట్లు తీసి సత్తా చాటారు. అయితే కేవలం ఐదు వికెట్లు తీసిన ఓ క్రీడాకారుడిని సెలెక్ట్ చేసి పంపడం విమర్శలకు తావిచ్చింది.

మా రాజ్యం మా ఇష్టం

జెంటిల్‌మెన్ గేమ్‌లోకి కొన్ని అవినీతి అనకొండలు చొరబడ్డాయి. జిల్లాలో పదునైన బ్యాట్స్‌మెన్, బౌలర్లు, వికెట్ కీపర్లను సానబట్టి తయారుచేసి దేశానికి అందించాల్సింది పోయి కొందరు డబ్బు, ఇతర వాటికి ప్రాధాన్యత ఇస్తారనే ఆరోపణలు ఉన్నాయి. అకాడమీలోకి తీసుకున్నాక మరికొందరు క్రీడాకారుల మహిళా కుటుంబ సభ్యుల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తారనే ఆరోపణలున్నాయి. ఆ బ్యాచ్ డిమాండ్, కోరిక నెరవేరితే సరే. ప్రతిభ లేకున్నా టీంలోకి ఎంట్రీ ఉంటుందని అంటున్నారు. కడప క్రికెట్ స్టేడియంలో ఉండాల్సిన పిచ్ తయారు చేసే యంత్రాన్ని సొంత స్టేడియం తయారీకి ఉపయోగించుకోవడం ఒక ఎత్తయితే అనర్హులను తీసుకువచ్చి అడ్డగోలుగా కోట్లు సంపాదించుకుని టీకి టికానీ లేనోళ్లు కూడా ఈ రోజు కోట్లాది రూపాయల ఆస్తులు, కళ్లు చెదిరే లగ్జరీ కార్లు కొని ఎంజాయ్ చేస్తున్నారు. ఒకాయన చిన్న ఉద్యోగి. క్రికెట్‌కు సంబంధించిన వారితో పరిచయం పెంచు కుని ఇప్పుడు ఆయన దగ్గరే క్రికెట్ అవసరమైన బ్యాట్లు, గ్లౌజులు, డ్రస్సులు ఇలా అన్నీ కొనేలా చేశాడు. ఒకప్పుడు సామాన్యుడిగా ఉన్న ఆయన ఇప్పుడు క్రికెట్‌నే శాసించే మాఫియాగా ఎదిగా డంటారు. ఇప్పుడు ఆయనకే కీలకమైన పదవి అప్పగించడంపై చర్చ నడుస్తోంది. మొత్తానికైతే కడప క్రీడాకారులను అకాడమీ బ్యాచ్‌లో ఉన్న కొందరు నాశనం చేస్తున్నారు. ఇప్పటికే కడపజిల్లా క్రికెట్‌లో జరుగుతున్న అవినీతి అక్రమాలు వేధింపులపై పలువురు ఫిర్యాదు చేశారు. నిన్నటిదాకా వైసీపీ గవర్నమెంటు ఉండడంతో మమ్మల్ని పీకలేరనే ధోరణిలో ఉన్నారు. ఇప్పుడు కూటమి అధికారంలోకి వచ్చింది. ఈ ప్రభుత్వమైనా అవినీతి పాములను ఏరివేస్తుందో లేదో వేచి చూడాలి.

పేదల భూములే టార్గెట్...

- ఆఘమేఘాల మీద ఫ్రీహోల్డ్ చేస్తూ.. జగన్ ప్రభుత్వంలో జీవో జారీ
- జిల్లాలో 7 వేలకు పైగా భూములకు అనుమతులు
- కూటమి ప్రభుత్వానికి పెద్ద ఎత్తున పేద రైతుల ఫిర్యాదులు
- రెవెన్యూ సదస్సులో నిగ్గు తేలనున్న పెద్దల బాగోతం

కడప(కలెక్టరేట్) సెప్టెంబరు 10: దశాబ్దాల కిందట పేదల జీవనోపాధి కోసం గత ప్రభు త్వాలు లక్షలాది ఎకరాల ప్రభుత్వ, అసైన్డ్ భూములను పంచి పెట్టింది. అయితే ఆ భూములు అమ్మడం, కొనడం నేరమని రెవెన్యూ చట్టాలు చెబుతున్నాయి. కానీ జగన్ సర్కారు వచ్చిందే తడువుగా అలాంటి పేదల భూములను టార్గెట్ చేసింది. అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించనున్నట్లు జగన్ సర్కారు గత ఏడాది డిసెం బరులో ఆఘ మేఘాల మీద ఫ్రీహోల్డ్ చేస్తూ జీవో నెంబరు 596 జారీ చేసింది. ఈ జీవో వస్తోందనే ముందస్తు సమాచారంతో వైసీపీకి చెందిన పెద్దలు రూ.కోట్లు విలువ చేసే పేదల భూములను నయానో, భయానో చేసి కొట్టేశారు. అధికారం చేతిలో ఉండడం, అధికారులు చెప్పిందే చేసే స్థితిలోఉండడంతో రెవెన్యూ చట్టాలకు పాతర వేసి అను మతులు పొందారు. నిషేధిత భూముల జాబితా నుంచి ఆసర్వే నెంబర్లు తీసి.. యథేచ్ఛగా రిజిస్ట్రేషన్లు చేసుకొని పేదల నోట్లో దుమ్ముకొట్టారు.

జిల్లాలో అసైన్డ్ భూములు, చుక్కల భూములు, ఇనాం భూములు, రస్తాలు, వంకలు, వాగులు వదలకుండా అనుమతులు పొంది అడ్డగోలు రిజిస్ట్రేషన్లు చేసుకొని.. ఇటు పేదలకు అటు ప్రభుత్వానికి టోకరా కొట్టారు. జగన్ పాలనలో చీకటి జీవోల వ్యవ హారం ప్రజలకు తెలిసేలోగా పెద్ద వ్యూహంతో వైసీపీ నేతలు, రెవెన్యూ అధికారులు కుమ్మక్కై పేదలకు చెందిన ప్రభుత్వ భూములను పెద్దల పాలు చేశారు. జిల్లాలో దాదాపు 7 వేల ఎకరాలకు పైగా పేదల భూములు ఫ్రీహోల్డ్ భూములుగా అనుమతులు పొంది, అధికార పెద్దలు కాజేసినట్లు విమర్శలు ఉన్నాయి. ఇలాంటి ఫ్రీహోల్డ్ భూముల వ్యవ హారంపై కొత్తగా కొలువుదీరిన కూటమి ప్రభుత్వానికి మోసపోయామంటూ పేదల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. చంద్రబాబు ప్రభుత్వం ఫ్రీహోల్డ్ భూముల వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. వైసీపీ పాలనలో ప్రభుత్వ భూముల ఆక్రమణలు, అన్యాక్రాం తంపై ఫ్రీహోల్డ్ భూములకు హోల్డేన్ అంటూ తాత్కాలికంగా 3 నెలలు బ్రేకులు వేసింది. పైలెట్ ప్రాజెక్టు కింద జమ్మలమడుగు డివిజన్, మైదుకూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో ఫ్రీహోల్డ్ భూముల అనుమతులు, రిజిస్ట్రేషన్ల పరంపరను రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్లు ఇప్పటికే 2800 ఎకరాల వరకు ఫ్రీహోల్డ్ భూముల అనుమతులు, రిజిస్ట్రేషన్ల వివరాల జల్లెడ పట్టి ఇప్పటికే కలెక్టర్‌కు ఒక నివేదిక సమర్పించినట్లు సమాచారం. ఇక పేదల భూముల అన్యాక్రాంతం, వైసీపీ నేతల ఆక్రమణలు తదితరాల గుట్టు రట్టుచేసి పేదలకు భరోసా కల్పించేందుకు చంద్రబాబు ప్రభుత్వం త్వరలో గ్రామ రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు, 45 రోజుల్లో పరిష్కారం చూపిం చేందుకు కలెక్టర్లు, జేసీలకు ఆదేశించారు.

రెవెన్యూ యంత్రాంగం సహకారంతోనే...

మూడు, నాలుగు దశాబ్దాల కిందట పేదలకు ఇచ్చిన ప్రభుత్వ భూములు నేడు పట్టణ ప్రాంతాలకు చేరువగా ఉన్నాయి. అధిక ధరలు పలుకుతుండడంతో రాజకీయ పెద్దల కళ్లు పడ్డాయి. 20 ఏళ్ల కిందట పేదలకు ఇచ్చిన ప్రభుత్వ భూములతో పాటు, చుక్కల భూములకు ఫ్రీహోల్డ్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇస్తూ చీకటి జీవో జారీ చేసింది. భూములు అమ్ముకోవచ్చని, రిజిస్ట్రేషన్లు కూడా చేసేలా నిషేధ భూముల జాబితా నుంచి ఈ సర్వే నెంబర్లను తీసేసే అధికారాలను కలెక్టర్లకు అప్పగించింది. ఇదే విషయాన్ని జీవో రాక ముందే వైసీపీలోని కొందరు రాజకీయ పెద్దలు, రియల్టర్లు పసిగట్టారు. ఇంకేముంది పట్టణ ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న పేదల భూముల వివరాలను తహశీల్దార్ల నుంచి ఫిల్టర్ చేయించారు. జాబితాలను చేత పట్టుకొని పేదల భూములను నయానో, భయానో పెద్దలకు కట్టబెట్టేలా రెవెన్యూ అధికారులే పెత్తనం కట్టబెట్టారు. దీంతో పేదల పక్షాన పని చేయాల్సిన రెవెన్యూ యంత్రాంగం జీ హుజూర్ అంటూ అప్పట్లో బేరసారాలు కుదర్చ డంలో కీలకపాత్ర పోషించారనే విమర్శలు ఉన్నాయి. కోట్లు ఖరీదు చేసే భూములను లక్షలకు అప్పనంగా వైసీపీ పెద్దలకు అమ్మించి పేదల కడుపు కొట్టారనే అపవాదు ఉంది. జగన్ సర్కారు గత ఏడాది జీవో జారీ చేసినప్పటి నుంచి జిల్లాలో పేదల భూములు దాదాపు 7 వేల ఎకరాలకు పైగా పెద్దల పాలైనట్లు తెలుస్తోంది.

టీడీపీ హయాంలో పేదల భూములకు రక్షణ 2014-2018 చంద్రబాబు పాలనలో చుక్కల భూముల వ్యహారంపై రైతుల డిమాండ్ మేరకు 2017లో చుక్కల భూములకు క్లియరన్స్ ఇచ్చేందుకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. రెండున్నర సంవత్సరాల్లో చుక్కల భూముల వ్యవహారంలో జాయింట్ కలెక్టర్ ఛైర్మన్‌గా, ఆర్డీవో, తహశీల్దారు, సర్వేయర్లు కన్వీనర్లుగా ఒక కమిటీ ఏర్పాటు చేసింది. నాలుగు స్టేజీ ల్లో ఆమోదం పొందితే తప్ప అడ్డగోలు పత్రాలు పెట్టి పేదల భూములు కొట్టేయాలని కుయుక్తులు పన్నిన నేతలకు నోట్లో వెలక్కాయపడ్డట్లైంది. నిజమైన అర్హులైతేనే తప్ప, ఆక్రమణదారులకు భూములు దక్కలేదు.

రెవెన్యూ సదస్సుల్లో ఆక్రమణల గుట్టురట్టు

వైసీపీ పాలనలో భూముల అన్యాక్రాంతం, ఆక్రమణలు, దేవదాయ, వక్ఫ్ భూములు, వంకలు, వాగులు, రస్తాలు తదితరాలకు సంబంధించిన ఫిర్యాదులు స్వీకరించనున్నారు. జిల్లాలో భూములకు సంబంధం ఉన్న 6 శాఖల అధికారులతో గ్రామస్థాయిలో రెవెన్యూ సదస్సుల ద్వారా ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకునేలా ఇప్పటికే కలెక్టర్ శివశంకర్ క్షేత్ర స్థాయి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అంతేకాకుండా ఫ్రీహోల్డ్ ల్యాండ్స్‌కు సంబంధించిన అనుమతులు, రిజిస్ట్రేషన్లతో పాటు, క్లాసిఫికేషన్ ల్యాండ్స్, ఫస్ట్ అసైన్ మెంట్ కేటాయింపు, మొదట అమ్మిన వారు, ప్రస్తుతం అనుభంలో ఉన్న వారి వివరాలను పారదర్శకంగా గుర్తించనున్నారు. అంతేకాకుండా బోగస్ పట్టాలతో ప్రభుత్వ, ప్రజల భూములు ఆక్రమించిన వారి జాతకాలు కూడా తేల్చేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. గ్రామ సభల్లో పూర్తి స్థాయిలో రెవెన్యూ, వక్ఫ్, దేవదాయ, అటవీ భూముల రికార్డులతో పాటు సర్వేశాఖకు చెందిన భూముల చిత్ర పటాలతో పూర్తి స్థాయిలో రెవెన్యూ సదస్సుల ద్వారా పేదలకు న్యాయం చేసే దిశగా ప్రభుత్వ యంత్రాంగం ముందస్తు ప్రణాళికతో సిద్ధమౌతోంది. రెవెన్యూ సదస్సులో ఆక్రమణదారులు, పేదల భూములు అప్పనంగా కొల్ల గొట్టిన బడాబాబుల బాగోతం గుట్టు రట్టు కావడం కాయంగా కనిపిస్తోంది.

టెక్స్‌టైల్ పార్కును అన్ని విధాల అభివృద్ధి చేస్తాం: కలెక్టర్

మైలవరం, సెప్టెంబరు 10: చేనేతల అభివృద్ధి కోసం టెక్స్‌టైల్ పార్కును అన్ని విధాల అభివృద్ధి చేసి.. త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తామని కలెక్టర్ శివశంకర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని టెక్స్‌టైల్ పార్కును పరిశీలించి.. అక్కడి లబ్ధిదారులకు ఇచ్చే 118 ప్లాట్లను పరిశీలించారు. అనంతరం చేనేతలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ హ్యాండ్‌లూమ్, పవర్‌లూం, డ్రాయింగ్ తదితర యూనిట్లు పెట్టు కునేం దుకు లబ్ధిదారులు ఈనెల 17వ తేదీలోగా రూ.50వేలను 50 మందికి తగ్గకుండా డిపాజిట్ చేయాలని.. వారికి ఈనెల 20వ తేదీ లాటరీ పద్ధతి ద్వారా తీసి ప్లాట్లను కేటా యిస్తామన్నారు. ప్లాట్లను కేటాయించిన వారికి బ్యాంక్ ద్వారా రుణాలు ఇప్పించి చేనేతల అభ్యున్నతికి ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందన్నారు. కేటాయించిన 6 లేదా 9 నెలల్లో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. గండికోట, మైలవరం వచ్చే పర్యాటకులు టెక్స్‌టైల్ పార్కుకు వచ్చే విధంగా అన్ని విధాల అభివృద్ధి చేసి అందుబా టులోకి తెస్తామన్నారు. అనంతరం టెక్స్‌టైల్ పార్కులో నీరు, విద్యుత్, రహదారులతో పాటు అన్ని మౌళిక సదుపాయాలు కల్పించే విదంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. మాజీ ఎమ్మెల్సీ నారాయణరెడ్డి మాట్లాడుతూ చేనేతలు దొమ్మరనంద్యాల, వేపరాల, మోర గుడి గ్రామాల్లో అధికంగా ఉన్నారని.. వేపరాల మీదుగా టెక్స్‌టైల్ పార్కుకు పాలాలకు వెళ్లే రహదారిని వేస్తే చేనేతలకు ఇక్కడికి రావడానికి 4, 5 కిలోమీటర్ల దూరం తగ్గుతుం దన్నారు. జమ్మలమడుగు ఆర్డీవో శ్రీనివాస్, చేనేత జౌళిశాఖ ఏడీ నాగరాజారావు, ఎమ్మార్వో లక్ష్మీనారాయణ, ఎంపీ డీవో శంషాద్ భాను, ఈవో పీఆర్డీ రామచంద్రారెడ్డి, చేనేత జౌళిశాఖ తదితర అధికారులు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.



మైలవరంలో టెక్స్‌టైల్ పార్కు ప్లాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ లోతేటి శివశంకర్

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ అన్నారు. మంగళవారం రాత్రి మైలవరంలోని బాలికల బీసీ హాస్టల్‌ను అకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో హాస్టల్‌లో వసతులపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ బాగా చదివి అనుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డన్ , ఆర్డీవో శ్రీనివాస్, ఎమ్మార్వో లక్ష్మీనారాయణ, ఎంపీడీవో శంషాద్ బాను, మండల అధికారులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.5 లక్షలు విరాళం

కడప (ఎర్రముక్కపల్లె), సెప్టెంబరు 10: విజయవాడ వరద ప్రమాద బాధితుల సహాయార్థం కమలాపురం శాసనసభ్యుడు పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి రూ.5లక్షల విరాళం అందజేశారు. మంగళవారం విజయవాడలో సీఎం చంద్రబాబునాయుడును కలిసి రూ.5లక్షల చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డిని సీఎం అభినందించారు.



సీఎం చంద్రబాబుకు చెక్కును అందిస్తున్న కమలాపురం ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి

జగనన్న కాలనీ కహానీ

బిల్లులు తీసుకుని కాంట్రాక్టర్లు పరారీ ● కొందరికి బేస్‌మెంట్లే పరిమితం

మరికొందరికి స్థలాలే మిగిలిన వైనం ● లబోదిబోమంటున్న లబ్ధిదారులు


ఉర్లగట్టుపోడు జగనన్న కాలనీ

రైల్వేకోడూరు, సెప్టెంబరు 10: నిరుపేదలకు సొంతింటి కల నెరవేరుస్తానని ఆర్భాటపు ప్రకటనలు చేసిన వైసీపీ ప్రభుత్వం చాలీచాలని ఇంటి పట్టాలను ఇచ్చింది. అంతేకాకుండా సొంతంగా ఇళ్లు కట్టిస్తామన్న ప్రభుత్వం చేతులెత్తేయడంతో నిరుపేదలు ఇళ్లు పూర్తి చేసుకోలేక అష్టకష్టాలు పడుతున్నారు. కొన్నింటి బిల్లులు తీసుకుని కాంట్రాక్టర్లు పరారయ్యారనే ఆరోపణలున్నాయి. కొందరికి బేస్‌మెంట్‌లు మిగలడం, మరి కొందరు ఇంటి స్థలాలకే పరిమితమయ్యారు. రైల్వేకోడూరు, చిట్వేలి, ఓబులవారిపల్లె, పుల్లంపేట, పెనగలూరు మండలాల్లో జగన్ ప్రభుత్వం 6378 మంది లబ్ధిదారులకు అట్టహాసంగా ఇళ్ల పంపిణీ చేపట్టారు. ఐదేళ్లలో లబ్ధిదారులకు ఇళ్లు పూర్తి చేయాలనే ధోరణిలో చర్యలు తీసుకోలేకపోయారు. దీంతో చాలా మంది ఇళ్లు పూర్తి చేసుకోలేకపోయారు. వివరాల్లోకెళితే....

రైల్వేకోడూరు మండలంలో 2288 మందికి, చిట్వేలిలో 834, ఓబులవారిపల్లెలో 1226, పెనగలూరులో 1228, పుల్లంపేటమండలాల్లో 802 మందికి పట్టాలు ఇచ్చారు. మొత్తం 2788 మంది లబ్ధిదారులు ఇళ్లను పూర్తి చేసుకున్నారు. 240 ఇళ్లకు శ్లాబులు పూర్తి అయ్యాయి, 807 ఇళ్లు బేస్‌మెంట్లవరకు, 575 ఇళ్లు గోడల లెవల్‌కు, 235 ఇళ్లు పునాది లెవల్‌లో ఉన్నాయి. పూర్తి కాని ఇళ్లలో పిచ్చి మొక్కలు మొలిచాయి. జగన్ కాలనీల్లో రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్ల వద్ద మురికి గుంతలు ఏర్పడ్డాయి. మట్టి రోడ్లపై కంప చెట్లు మొలిచాయి. స్థలాలకు పరిమితమైన వారు బంధువుల ఇళ్లలో తలదాచుకుంటున్నారు. ఇళ్లను ప్రభుత్వమే నిర్మిస్తామని చెప్పి వైసీపీ ప్రభుత్వం మాట తప్పిందని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాల కోసం వైసీపీ నేతలు కొందరు కాంట్రాక్టర్లను నియమించారు. పేమెంట్లు కాంట్రాక్టర్లకే ఇవ్వాలని లబ్ధిదారులకు అధికారులు, నాయకులు సమాచారం పంపించారు. అయితే బిల్లులు పడిన వెంటనే కాంట్రాక్టర్లు పరారీ అయ్యారని పలువురు లబ్ధిదారులు వాపోతున్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో జగనన్న కాలనీల్లో పాములు, తేళ్లు తిరుగుతున్నాయని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలనీల్లో రోడ్ల సౌకర్యాలు లేక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. తాగునీరు, విద్యుత్ తదితర మౌలిక సౌకర్యాలు లేక అనేక కష్టాలు పడుతున్నామని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హౌసింగ్ శాఖ ఇచ్చిన డబ్బు సరిపోక కొందరు అప్పు చేసి ఇళ్లను నిర్మించుకున్నారు. జగనన్న కాలనీల్లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో చాలా మంది కాపురాలు చేయలేకున్నారని లబ్ధిదారులు వివరిస్తున్నారు. రాత్రి వేళ బిక్కుబిక్కుమంటూ ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. జగన్‌పై ఆశలు పెంచుకుంటే ఇలా చేస్తారా అని తిట్టిపోసుకుంటున్నారు. బేస్‌మెంట్‌లు వేసుకుని ఐదేళ్లు పూర్తి అయినా ఇంత వరకు చాలా మందికి బిల్లులు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదేళ్లలో సొంత ఇంటికి సక్రమంగా ప్రారంభోత్సవాలు కూడా చేసుకోలేని స్థితికి లబ్ధిదారులు చేరుకున్నారు. కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వంలో ఇంటి నిర్మాణాలు పూర్తి చేసి లబ్ధిదారులకు ఇచ్చారు. జగన్ ప్రభుత్వంలో చాలీచాలని ఇంటి స్థలాలు ఇచ్చి అదికూడా పూర్తి చేయకుండా చేశారని లబ్ధిదారులు అంటున్నారు. ఇప్పటికైనా హౌసింగ్ శాఖ ప్రత్యేక దృష్టి పెట్టి ఇంటి నిర్మాణాల్లో ఎంత వరకు జాప్యం జరిగిందని ప్రభుత్వానికి నివేదిక ఇస్తే లబ్ధిదారులకు మేలు కలుగుతుందని ఆయా కాలనీ వాసులు కోరుతున్నారు.

స్థలం ఉంది పక్కాగృహం లేదు



స్థలం ఇచ్చారు, ఇల్లు కట్టివ్వలేదు. కనీసం పునాది లెవల్‌కు కూడా చేరుకోలేదు. బిల్లు వచ్చిందో రాలేదో తెలియదు. ఖాళీ స్థలంలో గుడిసె వేసుకుంటే పీకేశారు. బంధువుల ఇంట్లో తలదాచుకుంటున్నాము. కూటమి ప్రభుత్వం ఇంటి నిర్మాణం చేపట్టాలని కోరుకుంటున్నాము.

వంకాయల మంజుల, వెంకటేష్

చర్యలు తీసుకుంటున్నాము

కాలనీల్లో పెండింగ్ ఇంటి నిర్మాణాలపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాము. జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక పంపి ఉన్నాము. కాలనీల్లో ఉన్న సమస్యలు పరిష్కారం చేసేందుకు ప్రభుత్వానికి నివేదిక పంపుతాము.

మురళీకృష్ణ, ఏఈ రైల్వేకోడూరు హౌసింగ్


ఇంటివద్ద పెరిగిన పిచ్చి మొక్కలు


శ్లాబు పూర్తిన ఇంటి వద్ద చేరిన మురికినీరు


జగనన్న కాలనీలో రోడ్ల దుస్థితి


పునాదికే పరిమితమైన దృశ్యం

కొండ్రాజుపల్లెలో బాలిక ఆత్మహత్య


మాధవి మృతదేహం

కాశినాయన, సెప్టెంబరు 10: కొండ్రాజుపల్లెలో కత్తెరగండ్ల మాధవి(13) ఉరివేసుకుని చనిపోయినట్లు ఎస్ఐ హనుమంతు తెలిపారు. పోలీసులు, గ్రామస్థుల వివరాలమేరకు చెన్నయ్య పీరమ్మ దంపతుల కూతురు మాధవి వరికుంట్ల కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. 10రోజుల కిందట మాధవి ఇంటికి వచ్చి తిరిగి పాఠశాలకు వెళ్ళలేదు. అనారోగ్యంతో ఉండడంతో ఇంటివద్దే ఉంచగా, మంగళవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడిందని కుటుంబీకులు తెలిపారన్నారు. పోలీసులు కేసునమోదు శవాన్ని పోస్టుమార్టం కోసం పంపామన్నారు. మృతికి గలకారణాలు పోలీసుల విచారణలో తెలియాల్సిఉంది. కాగా రెండేళ్ల కిందట మృతురాలి తండ్రి చెన్నయ్య అప్పులబాధతో ఆత్మహత్య చేసుకున్నాడు.

దళితులపై వైసీపీ నేతల దాడి

రాజంపేట టౌన్, సెప్టెంబరు 10: పులపత్తూరు వాసి కుంభగిరి వెంకటసుబ్బయ్య, ఎల్లయ్యపై వైసీపీ నేతలు దాడి చేశారని పోలీసులు తెలిపారు. గత ఎన్నికల్లో వెంకటసుబ్బయ్య టీడీపీ ఏజెంటుగా పనిచేశాడని, తమ మాట వినలేదని కక్షపెట్టుకున్న వారు సోమవారం వినాయక నిమజ్జన సమయంలో మా ఇళ్ల మీదుగా ఎలా వెళతారంటూ నిలదీశారు. అంతేకాకుండా తామరచెరువు వద్ద ప్రసాద్‌రెడ్డి, వంశీరెడ్డి, కార్తీకరాజు, రాజశేఖర్‌రెడ్డి, శివకుమార్‌రాజు, సుధీర్‌రాజు, శ్రీనివాసరాజు అర్ధరాత్రి విచక్షణా రహితంగా దాడి చేశారు. వారినుంచి తప్పించుకుని అడవి మార్గాన రేణింతల పైనుంచి రాజంపేట మన్నూరు పోలీసుస్టేషన్‌కు చేరుకుని తల దాచుకున్నట్లు తెలిపారు. దాడి ఘటనను మన్నూరు పోలీసులకు తెలపడంతో వారు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదుపై విచారిస్తున్నట్లు మన్నూరు సీఐ రామాంజనేయుడు తెలిపారు.

బాధితుడిని పరామర్శించిన సుగవాసి


వెంకటసుబ్బయ్యను పరామర్శిస్తున్న సుగవాసి బాలసుబ్రమణ్యం

గత ఎన్నికల్లో టీడీపీకి మద్దతు ఇచ్చిన వెంకటసుబ్బయ్యపై వైసీపీ రౌడీ మూకలు విచక్షణా రహితంగా దాడి చేయడాన్ని ఆయన ఖండించారు. దాడికి పాల్పడిన వారిపై చట్టపర చర్యలు చేపట్టాలని ఆయన సీఐని కోరారు. కార్యకర్తకు ఆపదలో తాము వెన్నుంటామని ఆయన భరోసా కల్పించారు. టీడీపీ నేతలు గన్నే సుబ్బనరసయ్య, గుగిళ్ల చంద్రమౌళి, తుపాకుల అశోక్, టి.లక్ష్మీనారాయణ, గీతాంజలి రమణ, నామా హరి, షామీర్‌బాషా, సుబ్బరాయుడు, మేకవారిపల్లె రమణ పరామర్శించారు.

వైవీయూలో బీకాం హానర్స్ ప్రారంభం : వీసీ


సమావేశంలో మాట్లాడుతున్న వైస్‌చాన్సలర్ క్రిష్ణారెడ్డి

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 10: వైవీయూలో బీకాం హానర్స్ కోర్సు ప్రారంభించినట్లు వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం వైవీయూలో బీకాం హానర్స్ నూతన కోర్సును రిజిస్ట్రార్ ప్రొఫెసరు ఎస్.రఘునాథరెడ్డితో కలిసి లాంఛనంగా కోర్సు ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ డిగ్రీకోర్సు ప్రారంభించడం ఇది మొదటి సారి అని, విద్యార్థుల చదువుకు అన్నివిధాలా వైవీయూ అనువైనదన్నారు. రాష్ట్రంలోనే విశ్వవిద్యాలయాలతో పోల్చుకుంటే వైవీయూలో ఉన్న సదుపాయాలు మరెక్కడాలభించవన్నారు. ఇక్కడున్న మానవ వనరులు మౌలిక సదుపాయాలు విద్యార్థులకు సౌకర్యవంతంగా ఆహ్లాదకరంగా చదువుకోవడానికి ఉపయోగపడతాయన్నారు. రిజిస్ట్రారు రఘునాథరెడ్డి మాట్లాడుతూ బీకాం విద్యార్థులు యోగివేమన అధ్యాపకులు ఎల్లవేళలా అందుబాటులో ఉండి నాణ్యమైన విద్యాబోధన అందిస్తారన్నారు. చదువుల గురించి సందేహాలు వచ్చినప్పుడు సహాయ సహకారాలు అందిస్తారని మార్గదర్శనం చేస్తారన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

23 టీఎంసీలు దాటిన గండికోట నీటిమట్టం



కొండాపురం, సెప్టెంబరు 10: గండికోట ప్రాజెక్టులో నీటిమట్టం 23 టీఎంసీలు దాటినట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. సీబీఆర్‌కు 1500 క్యూసెక్కులు, పెడిపాలెం రిజర్వాయర్‌కు 770 క్యూసెక్కులు, వామికొండ, సర్వరాయసాగర్‌కు 700 క్యూసెక్కుల చొప్పున గండికోట ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు. గండికోట ప్రాజెక్టులోకి జీఎన్ఎస్ఎస్ కెనాల్ ద్వారా 10000 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉన్నట్లు తెలిపారు. గండికోట ప్రాజెక్టులోకి 25 టీఎంసీల నీరు చేరిన తర్వాత అంటే రెండు,మూడు రోజుల్లో మైలవరం జలాశయానికి నీరు విడుదల చేయనున్నట్లు డీఈ తెలిపారు. కాగా గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 26.85 టీఎంసీలని తెలిపారు.

చిలమకూరు అవినీతిపై కలెక్టర్ కొరడా

● పంప్ ఆపరేటర్ విధుల నుంచి తొలగింపు

● సొమ్ము రికవరీ - కేసు నమోదుకు ఆదేశం

ఎర్రగుంట్ల సెప్టెంబరు 10: చిలమకూరు పంచాయతీలో జరిగిన అవినీతిపై కలెక్టర్ లోతేటి శివశంకర్ కొరడా ఝుళిపించారు. పదేళ్లగా జరుగుతున్న అవినీతి అక్రమాలపై వచ్చిన ఆరోపణలపై వేసిన కమిటీ నివేదిక మేరకు పంపు ఆపరేటర్ ఆవుల రామకృష్ణ అక్రమాలకు పాల్పడ్డాడని, అతన్ని వెంటనే విధుల నుంచి తొలగించాలని కలెక్టర్ మండల అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. పని చేయకుండా తీసుకున్న రూ.4,53,600 జీత భత్యాలను రికవరీ చేస్తూ రామకృష్ణపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆదేశించారు. 2019 నుంచి విధులకు హాజరు కాకుండా పంచాయతీకి సంబంధించిన 35 పనులు భార్య పేరుతో నిర్వహించి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డాడని రుజువైంది. సొంత స్థలంలో బోరు వేసి ప్రభుత్వ డబ్బుతో మోటారు అమర్చి నీటి వ్యాపారం చేశాడన్న ఆరోపణ, విధులకు హాజరు కాకుండా జీతాలు తీసుకున్నాడన్న ఆరోపణ, స్థానిక ఐసీఎల్ విరాళంగా ఇచ్చిన సొమ్ములో అవినీతి జరిగిందని బీజేపీ ఎంపీటీసీ నవీన్‌కుమార్ గతంలో కలెక్టర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయడం, మండల సమావేశాల్లో ప్రస్తావనకు తీసుకువచ్చారు. ఈవిషయం పై ప్రత్యేక కమిటీని విచారణకు డీఎల్‌పీఓ ఆధ్వర్యంలో నియమించారు. వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించినా టీడీపీ ప్రభుత్వం రాగానే ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి టీడీపీ ఇచార్జి భూపేష్‌రెడ్డి ఆదేశాల మేరకు విచారణ వేగవతం చేసి నివేదిక కలెక్టర్‌కు పంపారు.

చిలమకూరు పంచాయతీలో ఎన్ఎంఆర్(పంప్ ఆపరేటర్) రామకృష్ణ కార్యదర్శితో కలిసి 2014 నుంచి 2024 వరకు రూ.35 లక్షల నిధులు దుర్వినియోగం చేశాడు. సీసీరోడ్లు ,సైడ్ కాల్వలు, కొత్త బోర్లు, పైపుల నిర్మాణాలు, కొత్త మోటార్ల కొనుగోలు, తదితరాలన్నింటినీ రామకృష్ణ తన భార్య పార్వతి దేవి పేరుతో చేశారని ఆరోపణ. ఐసీఎల్ వారు గ్రామ అభివృద్ధి కోసం ఇచ్చిన నిధుల్లో కూడా అవినీతి జరిగినట్లు ఫిర్యాదు చేశాడు. రామకృష్ణ సొంత స్థలంలో బోరు వేసి పంచాయతీ డబ్బుతో కొన్న మోటార్లు అమర్చి పంచాయతీకి నీటిని అమ్మేడని ఆరోపణలున్నాయి. ఐదేళ్లగా పనిచేకున్నా జీతం తీసుకున్నాడని ఎంపీటీసీ ఆరోపించారు.

అన్నమాచార్య అధ్యాపకుడికి డాక్టరేట్



సికెదిన్నె, సెప్టెంబరు 10: అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల సహాయ ఆచార్యులు ఓ.హోమకేశవ్‌కు డాక్టరేట్ లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ అధ్యాపకుడు హోమకేశవ్‌కు తమిళనాడు రాష్ట్రం ఏలూరు విశ్వవిద్యాలయం డాక్టరేట్ను ఇచ్చిందన్నారు. ఏలూరు వీఐపీ విశ్వవిద్యాలయం ఆచార్యులు డాక్టర్ జి.కె.రజని పర్యవేక్షణలో పరిశోధనకు డాక్టరేట్ లభించిందన్నారు. కళాశాల అధ్యాపకునికి డాక్టరేట్ లభించడంపట్ల విద్యాసంస్థల అధినేత డాక్టర్ చొప్పా గంగిరెడ్డి, వైస్‌చైర్మన్ చొప్పా యల్లారెడ్డి, ఈడీ చొప్పా అభిషేక్‌రెడ్డి, వివిధ విభాగాల అధిపతులు ఏవో రామసుబ్బారెడ్డి తదితరులు అభినందించారు.

డాడీహోంలో ఆకస్మిక తనిఖీ

సమస్యలు వివరించిన వృద్ధులు ● ఆలస్యంగా వెలుగు చూసిన వైనం



రికార్డు తనిఖీ చేస్తున్న ఆర్డీఓ శ్రీనివాస్ - డాడీ హోంలో వృద్ధులతో మాట్లాడుతున్న ఆర్డీఓ

జమ్మలమడుగు, సెప్టెంబరు 10: మైలవరం డాడీహోంలో జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశాల మేరకు ఆర్డీఓ శ్రీనివాస్, స్థానిక సిబ్బందితో 6వ తేదీ వెళ్లి పరిశీలించినట్లు సమాచారం ఆలస్యంగా వెలుగు చూసింది. డాడీహోం యజమాని రాజారెడ్డి మృతి తర్వాత కొత్త కమిటీని ఏర్పాటు చేశారని, మళ్లీ కమిటీ మారిందని, వృద్ధులు తెలిపినట్లు సమాచారం. పది రోజుల కిందట డాడీహోం వృద్ధాశ్రమం వృద్ధులు, విద్యార్థులు, సిబ్బంది ఫౌండేషన్ వివాదంపై ప్రస్తుతం తమకు సేవలు సక్రమంగా అందడం లేదని, రక్షణ కల్పించాలని కలెక్టర్ కార్యాలయంలో బాధితులంతా వెళ్లి ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశాల మేరకు జమ్మలమడుగు ఆర్డీఓ, స్థానిక సిబ్బందితో ఆకస్మికంగా 6వ తేదీ వెళ్లి పరిశీలించినట్లు సమాచారం ఆలస్యంగా వెలుగు చూసింది. తనిఖీ చేసిన సమస్యలు గోప్యంగా ఉంచినట్లు తెలుస్తోంది. ఏదేమైనా కమిటీ ట్రస్టు, డాడీహోం, ప్రొద్దుటూరు సమీపంలో ఉన్న పూజా ఇంటర్నేషనల్ స్కూల్‌పై క్షుణ్ణంగా విచారించినట్లు బాధితుల ద్వారా తెలుస్తోంది. డాడీహోంలో విద్యార్థులు, వృద్ధులకు జరుగుతున్న అన్యాయాన్ని కమిటీ ఏమాత్రం పట్టించుకోవడంలేదని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి దృష్టికి బాధితులు తీసుకెళ్లి వినతి పత్రం అందించినట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా అనాథలు, అభాగ్యులు, వృద్ధులు, పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం, జిల్లా అధికారులు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని బాధితులు విజ్ఞప్తి చేశారు. తమకు న్యాయం జరుగుతుందో లేదోనని ఆందోళన చెందుతున్నట్లు బాధితులు మంగళవారం విలేకరులకు తెలిపారు.

బాలికల ఉన్నత పాఠశాల ఆకస్మిక తనిఖీ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

చిన్నమండెం, సెప్టెంబరు10: జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ చామకూరి శ్రీధర్ పాఠశాలలో ఉపాధ్యాయులు అటెండెన్స్ రిజిస్టర్ తనిఖీ చేశారు. విద్యార్థుల సంఖ్య, పాఠశాలలో రోజు వారి అమలు చేస్తున్న మెనూ ప్రకారం, లెసన్ ప్రణాళికలు, టాయిలెట్స్ నిర్వహణలపై పాఠశాల ప్రధానోపాధ్యాయులపై రమాదేవిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల గట్టుపై కూర్చుని విద్యార్థినులతో మమేకమై చదువుపై వారికి గల ఆసక్తి పాఠ శాలలో విద్యాబోధన, అమలు చేస్తున్న మెనూపై ఆరా తీశారు. మెనూ నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేసిన విద్యార్థిను లు, ఉపాధ్యాయులతో కలిసి పాఠశాలలో భోజనం చేసి కలెక్టర్ మెనూ నాణ్యతను పరిశీలించారు.

సమస్యలపై ఆరా తీసిన కలెక్టర్

పాఠశాలలో నెలకొన్న సమస్యలపై అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆరా తీశారు. పాఠశాలకు ప్రహరీ లేదని, ఏర్పాటు చేయాలని, తాగునీరు ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు విన్నవించిన విద్యార్థినులు, ఉపాధి హామీ కింద ప్రహరీ వరకు ప్రతిపాదనలు ఇచ్చామని, ఇంకా మంజూరు కాలేదని కలెక్టర్‌కు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమాదేవి వివరించారు. ప్రహరీ నిర్మాణానికి వెంటనే చర్యలు తీసుకుంటామని, ప్రత్యేక నిధులతో తాగునీటి కొరకు ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని విద్యార్థినులకు హామీ ఇచ్చిన కలెక్టర్ సర్వేయర్‌తో పాఠశాల ప్రహరీ కొలతలు వేయించాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు వల్లూరు బాలికలు


ఎంపికైన విద్యార్థులతో పీఈటీ

వల్లూరు, సెప్టెంబరు 10: రాష్ట్రస్థాయి అండర్ 19 ఖోఖో విభాగం పోటీల్లో మోడల్ స్కూలు ఇంటర్ బాలికలు ఇద్దరు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సురేశ్‌కుమార్ తెలిపారు. సీనియర్ ఎంపీసీ మమత, బైపీసీ చదువుతున్న మోబీన జిల్లా స్థాయి పోటీల్లో రాణించడంతో వీరు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఎంపికైన బాలికలను, ప్రోత్సహించిన పీఈటీ సుశీలమ్మను పలువురు అభినందించారు.

మహిళా డిగ్రీకళాశాలకు 31వ ర్యాంకు

- ప్రిన్సిపాల్ డాక్టర్ సలీంబాషా

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 10: ఎడ్యుకేషన్ వరల్డ్ ఇండియా హయ్యర్ ఎడ్యుకేషన్ ర్యాంకు సర్వే 2024-25కు జాతీయ స్థాయిలో కడప ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు 31వ ర్యాంకు లభించిందని ప్రిన్సిపాల్ డాక్టర్ సలీంబాషా తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో ఏడో ర్యాంకు కళాశాలకు దక్కిందన్నారు. రాయలసీమ మహిళా డిగ్రీ కళాశాలలో ఇటువంటి ర్యాంకులు వచ్చిన ఏకైక కళాశాల కావడం గర్వంగా ఉందన్నారు.

ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు


గాయపడిన కంచయ్య

రాజంపేట టౌన్, సెప్టెంబరు 10: స్థానిక ఆర్టీసీ డిపో సమీపంలో మంగళవారం బస్సు - బైకు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇసుకపల్లె నుంచి పట్టణంలో కూలీకి వచ్చి భోజనం కోసం వెళుతుండగా కడప డిపో ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో పొట్లూరు కంచయ్య, మేకల వెంకటయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. వెంకటయ్య తలకు తీవ్ర గాయమవడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. రాజంపేట పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

నిమజ్జనాల్లో అపశృతులు అరికట్టాలి

వేంపల్లె, సెప్టెంబరు 10: వినాయక నిమజ్జనాల్లో అపశృతులు అరికట్టాలని రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ నేత తులసిరెడ్డి సూచించారు. మంగళవారం వేంపల్లెలో ఆయన మాట్లాడుతూ సోమవారం కడప, తిరుపతి జిల్లాల్లో మృతులు, గల్లంతులవడం శోచనీయమన్నారు. కడప జిల్లా వీరపునాయునిపల్లెలో ఇద్దరు, చక్రాయపేట మండలంలో ఒకరు, తిరుపతి జిల్లా నాయుడుపేటలో గల్లంతైన ముగ్గురిలో ఒకరి శవం దొరకడంలాంటి దురదృష్టకర సంఘటనలు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్నాయన్నారు. మరోవారం రోజులు నిమజ్జన కార్యక్రమాలు కొనసాగుతాయని, తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే ఎక్కువ ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉందన్నారు. పోలీసులు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

రేషన్ బియ్యం పట్టివేత


రేషన్ బియ్యంతో పట్టుబడిన లారీ

ఖాజీపేట, సెప్టెంబరు 10: అంజనేయకొట్టాలు దారిలోని ఫ్లైఓవర్ వద్ద రేషన్ బియ్యాన్ని ప్రజా సంఘాల నేతలు పట్టుకున్నారు. అందిన సమాచారం మేరకు ప్రజా సంఘాల నాయకులు సీఐ మోహన్‌కు తెలపడంతో లారీని, బియ్యాన్ని తహసీల్దారు సరస్వతికి అప్పగించారు. తహసీల్దారు బియ్యాన్ని శాంపిల్ చూసి ల్యాబ్‌కు పంపారని, నివేదిక వచ్చిన తర్వాత చర్యలు చేపడతామన్నారు.

వరద బాధితులకు రూ.5లక్షలు విరాళం


మంత్రి నారాలోకేశ్‌కు విరాళం అందిస్తున్న ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, చిత్రంలో మంత్రి మండిపల్లి

పులివెందుల టౌన్, సెప్టెంబరు 10: వరద బాధితుల సహాయార్థం ఎమ్మెల్సీ భూమిరెడ్డిరాంగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో రూ.5లక్షల చెక్కును అందించారు. పలువురు దాతలు ఇచ్చిన రూ.5లక్షల చెక్కు, డీడీలను విజయవాడలో మంత్రి నారాలోకేశ్‌కు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అందించారు. దాతల సహాయ సహకారాలు మరువలేమని, ఎమ్మెల్సీని లోకేశ్ అభినందించారు.

ఐదేళ్ల ఎమ్మెస్సీ ప్రవేశానికి రేపు ఆఖరు

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 10: వైవీయూ పోస్టుగ్రాడ్యుయేషన్ కళాశాలలో ఎమ్మెస్సీ ఎర్త్ సైన్స్ ప్రవేశానికి రేపటితో ఆఖరని వైవీయూ డైరెక్టరు డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ తెలిపారు. ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ అప్లైడ్ జియలజీ కోర్సులో ప్రవేశాలకు 11, 12 తేదీల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని తెలిపారు. ఈ కోర్సుల్లో పట్టభద్రులైన వారికిమంచి ఉద్యోగావకాశాలు ఉన్నాయన్నారు. ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు కోర్సుల్లో ప్రవేశానికి అర్హులని స్పష్టం చేశారు.

బతికి సాధించాలన్న బలమైన కాంక్ష అవసరం



మాట్లాడుతున్న డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 10 : సమస్యలకు భయపడి నిండు జీవితాన్ని మధ్యలోనే తుంచేయక బతికి సాధించాలన్న బలమైన కాంక్ష ఉండాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య పేర్కొన్నారు. మంగళవారం ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ పురుషుల కళాశాల, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కొండూరు జనార్థనరాజు పర్యవేక్షనలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భఆగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 15 నుంచి 25 ఏళ్లలోపు వయసుగల యువత ఈ నాలుగేళ్లలో వెయ్యిమందికి పైగా ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. జీవితం అత్యంత విలువైనదని, సంపూర్ణంగా జీవించాలన్న బలమైన కాంక్షతో బతికి జన్మసార్థకత చేసుకోవాలని సూచించారు.

మానసిక సమస్యలను అధిగమించాలి: డీఎస్పీ


మాట్లాడుతున్న పులివెందుల డీఎస్పీ మురళీనాయక్

పులివెందుల టౌన్, సెప్టెంబరు 10 : ప్రతి ఒక్కరూ మానసిక సమస్యలను అధిగమించాలని పులివెందుల డీఎస్పీ మురళీ నాయక్, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శ్రీనివాసులు అన్నారు. మంగళవారం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ యూనిట్ 1 అండ్ 2, జన విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శ్రీనివాసులు అధ్యక్షత వహించి మాట్లాడారు. పులివెందుల డీఎస్పీ మురళీనాయక్ మహాభారతం, రామాయణం ఇతిహాసాల్లోని ఉదాహరణలు తీసుకుని ఆత్మహత్యలను ఎలా అధిగమించాలో వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ ఎల్.సుధీర, డాక్టర్ సి. బాలనారాయణ, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటరు ఎన్.శ్రీనివాసరెడ్డి, డాక్టర్ కె.విజయలక్ష్మి, ఆయుష్ డాక్టర్ రాధిక, ఓబుళపతి, వాణి, రెడ్డమ్మ, లిఖిత, ఇతర అధ్యాపక, అధ్యాపకేతర బృందం తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన

కడప (సెవెన్‌రోడ్స్), సెప్టెంబరు 10 : ప్రజావ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలకు స్వస్తి పలకాలని మంగళవారం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కడప ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎల్. నాగసుబ్బారెడ్డి, మనోహర్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి మాట్లాడారు.

'కడపలో యథేచ్ఛగా దొంగతనాలు'

కడప (సెవెన్‌రోడ్స్), సెప్టెంబరు 10 : కడప నగరంలో యథేచ్ఛగా పట్టపగలే దొంగతనాలు జరుగుతున్నాయని, ఇంటి వారు బయటికి వెళితే చాలు వాకిళ్లను, బీరువాలను పగలగొట్టి బంగారు నగలు, డబ్బు దోచుకెళుతున్నారని ఆర్పీపీ నగర కార్యదర్శివర్గసభ్యులు మడగలం ప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆర్పీపీ కార్యాలయంలో నగర నాయకులు విజయకుమార్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. పోలీసులు ఆయా ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి భద్రత కల్పించాలని కోరారు. కలెక్టరు సర్కిల్ నుంచి రిమ్స్ వరకు, ఎల్ఐసీ సర్కిల్ నుంచి బుద్ద టౌన్‌షిప్ వరకు కెమెరాలను అమర్చాలని కోరారు.

మంచి దస్తూరి ఓ కళ: ఎంఈఓ

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 10 : మంచి దస్తూరి ఓ కళ అని ఎంఈవో-2 ఇర్షాద్ అహ్మద్ తెలిపారు. మంగళవారం మున్సిపల్ ఉర్దూ ప్రైమరీ స్కూలులో ఎస్టీయూ జిల్లా కార్యదర్శి హెడ్‌టీచరు ఎస్.నజీబుల్లా సహకారంతో విద్యార్థులకు హ్యాండ్ రైటింగ్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చక్కగా రాయడం నేర్చుకోవాలన్నారు. హ్యాండ్ రైటింగ్‌తో వ్యక్తి మూర్తిమత్వం కూడా అంచనా వేయవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్‌బాషా పాల్గొన్నారు.

'ఉర్దూ పాఠశాలల అసంబద్ధ సర్దుబాటును రద్దు చేయాలి'


వినతిపత్రం అందిస్తున్న రూటా ప్రతినిధులు

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 10 : జిల్లాలో ఉర్దూ పాఠశాలల ఉపాధ్యాయుల అసంబద్ధ సర్దుబాటు రద్దు చేయాలని రూటా జిల్లా ప్ర.ధాన కార్యదర్శి షాకిర్‌హుసేన్, రెహ్మాన్ డిమాండ్ చేశారు. మంగళవారం కడప నగరం మానస ఇన్‌లో జిల్లా నోడల్ అధికారి మధుసూదనరావును కలిసి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా దీనిపై మధుసూదన్‌రావు స్పందిస్తూ ఉర్దూ మీడియం పాఠశాలలో తెలుగు మీడియం విద్యార్థులు ఉన్నారా అని ఆరా తీశారు. అలాగే ఉపాధ్యాయులకు సర్దుబాటుపై వచ్చిన ఉపాధ్యాయులకు అడిగి తెలుసుకుఆన్నారు. దీనిపై ప్రభుత్వంతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు షబ్బీర్, ఆయుబ్ పాల్గొన్నారు.

పోస్టల్ కార్యాలయాన్ని సందర్శించిన ఎంపీ అవినాష్‌రెడ్డి

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 10 :కడప నగరం ఎన్జీవో కాలనీలో నూతనంగా నిర్మాణమైన పోస్టల్ కార్యాలయాన్ని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పరిశీలించారు. మంగళవారం ఆయనతో పాటు మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, మేయరు సురేశ్‌బాబు, వైసీపీ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే రవీంద్ర నాథరెడ్డితో కలిసి పోస్టాఫీసును సందర్శించారు. కార్యాలయంలో ఇంకా అవసరమైన వసతులపై అధికారులతో మాట్లాడారు. అనంతరం హైదరాబాదులో ఉన్న పోస్టు మాస్టర్ జనరల్‌తో ఫోనులో మాట్లాడి కార్యాలయంలో పోస్టుమాస్టరు కేబిన్ నిర్మాణానికి సంబంధించి చర్చించారు. దీనిపై పీఎంజీ స్పందించి త్వరలో టెండర్లు ప్రకటిస్తామని ఎంపీకి తెలియజేసినట్లు తెలిపారు.

ఆర్‌జేడీకి ఉపాధ్యాయ సంఘాల వినతి


ఆర్‌జేడీకి వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయసంఘాల ప్రతినిధులు

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 10 : ఉపాధ్యాయ సంఘాలపై అసభ్యపదజాలంతో దూషించి వారిపై దాడికి పాల్పడ్డ డీఈఓ కార్యాలయ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్‌జేడీ కార్యాలయంలో ఆర్‌జేడీ శ్యామ్యూల్‌ను కలిసి వినతిపత్రం అందించారు. దీనిపై ఆర్‌జేడీ స్పందిస్తూ దీనిపై విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.పీఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జమాల్‌రెడ్డి, ఏపీఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.రామాంజనేయులు, యుటీఎఫ్ నాయకులు వెంకటసుబ్బయ్య, బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధానకార్యదర్శి ఆర్.హరికొండయ్య, ప్రధానోపాధ్యాయులు మురళీక్రిపాల్గొన్నారు.

ఆపద సమయంలో అండగా ఉందాం


వరద సహాయక చర్యల్లో ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి...


నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి


చెక్కును క్రిష్ణారెడ్డికి అందిస్తున్న పాతకడప టీడీపీ నేతలు

● వరదముంపు ప్రాంతాల్లో సహాయక చర్యల్లో పాల్గొన్న కమలాపురం ఎమ్మెల్యే

కమలాపురం రూరల్/చెన్నూరు, సెప్టెంబరు 10 : ఆపద సమయంలో అండగా ఉందామని ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి అన్నారు. విజయవాడ జక్కంపూడి వరద ప్రాంతాల్లో జరుగుతున్న సహాయక చర్యల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. వరద బాధితులను పరామర్శించారు. ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందని, భయపడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. కడప పార్లమెంటు తెలుగు యువత అధ్యక్షుడు పుత్తా యల్లారెడ్డి, లేబాక ప్రతాప్‌రెడ్డి, తెలుగుయువత జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పవన్‌కుమార్‌రెడ్డి, ఐటీడీపీ కడప పార్లమెంటు ప్రధాన కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, ఐటీడీపీ మణికంఠ, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోవడమే లక్ష్యం

● రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

పులివెందుల టౌన్, సెప్టెంబరు 10: వరద బాధితులను ఆదుకోవడమే ప్రభుత్వ ప్రధమ లక్ష్యమని రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు విజయవాడ 5వ డివిజన్ క్రీస్తురాజపురంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొండ చరియలు విరిగి పడి మరణించిన కుటుంబాలను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ప్రభుత్వం వరద ప్రాంతాల ప్రజలను రైతులను ఆదుకోవడమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు.

సీపీఐ విరాళాల సేకరణ

కడప (సెవెన్‌రోడ్స్), సెప్టెంబరు 10 : విజయవాడ వరద బాధితులకు మంగళవారం కడప నగరంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, జిల్లా కార్యవర్గసభ్యులు ఎల్.నాగసుబ్బారెడ్డి, గాలిచంద్ర, సుబ్రమణ్యం, సుబ్బారెడ్డి, వేణుగోపాల్, కేసీ బాదుల్లా, గంగాసురేశ్, మునెయ్య, లింగన్న, శివశంకర్, బ్రహ్మం విరాళాలు సేకరించినట్లు తెలిపారు. జమ్మలమడుగు సీపీఐ కార్యకర్తలు సేకరించిన విరాళాల మొత్తం రూ.27వేలను జమ్మలమడుగు సీపీఐ కార్యదర్శి ఎంవీ సుబ్బారెడ్డి సీపీఐ జిల్లాకార్యదర్శి గాలి చంద్రకు అందించారు.

సీఎస్ఆర్ 720 - సీపీఐ నేతల విరాళాల సేకరణ

విజయవాడ వరద బాధితులకు మేము సైతం

- పాత కడప టీడీపీ నేతలు రూ.5 లక్షలు వితరణ

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 10 :విజయవాడ వరద బాధితులకు మేం సైతం అంటూ పాత కడప టీడీపీ నేతలు నడుం బిగించారు. రూ.5లక్షలు వితరణను ప్రకటించారు. ఈ సందర్భంగా రైస్ మిల్లు వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ సీఎం చంద్రబాబు పిలుపు మేరకు పాత కడప ప్రాంతంలో స్థానికుల నుండి విరాళాలు సేకరించామన్నారు. స్థానికుల సహకారం మరువలేనిదన్నారు. సేకరించిన ఐదు లక్షల విరాళాన్ని టీడీపీ క్లస్టరు యూనిట్ అధ్యక్షులు, మాజీ సర్పంచ్ క్రిష్ణారెడ్డికి అందించామన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పోరేటరు ఇసుకపల్లి చైతన్య, మహేశ్‌కుమార్, బండ్ల నాగేశ్వర్‌రావు, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కును ప్రభుత్వ ఆధీనంలో నడపాలి


డిప్యూటీ తహసీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కమలాపురం రూరల్, సెప్టెంబరు 10 : విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పడాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమర్థించుకోవడం తెలుగు ప్రజల మనోభావాలను తాకట్టు పెట్టడమేనని ఎఐటియుసి ఏరియా అధ్యక్ష కార్యదర్శులు డి.రాణి, పి.చంద్రశేఖర్‌లు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కమలాపురంలోని తహసీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారుకు ఎఐటియుసి ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని సమర్పించి మాట్లాడారు. 33 మంది ప్రాణత్యాగాలతో నిర్మితమైన విశాఖ ఉక్కును ప్రభుత్వ ఆధీనంలో నడపాలని డిమాండ్ చేశారు. సీపీఐ ఏరియా సహాయకార్యదర్శి నాగేశ్వర్‌రావు, మండల కార్యదర్శి వరప్రసాద్, ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి అమ్ములు, ఎఐటియుసి ఏరియా కార్యవర్గసభ్యులు భారతి, నాగలక్ష్మి, తులసి, డీడీకేఎస్ నాయకులు పాల్గొన్నారు.

తెగుళ్లు నివారించకకుంటే రైతులకు తీవ్ర నష్టం

● జేడీ నాగేశ్వరరావు


రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేడీ నాగేశ్వర్‌రావు

చెన్నూరు, సెప్టెంబరు 10 : వర్షాలు కురుస్తున్న ప్రస్తుత సీజన్‌లో రైతులు తాము సాగు చేసిన పంటల్లో తెగుళ్ల ఉధృతి తగ్గించుకోవాలని లేదంటే తీరని నష్టం తప్పదని జిల్లా వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు అయితే నాగేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం చెన్నూరులోని మూడో రైతు భరోసా కేంద్రంతోపాటు రైతులు సాగు చేసిన పూలతోటలు, వరి పంటను పరిశీలించారు. రైతుభరోసా కేంద్రంలో ఈకేవైసీ ఎలా చేస్తున్నారు. ఈ నెల 15తేదీ చివరి తేది అని, ఆ రోజుకల్లా ఈకేవైసీని రైతులతో పూర్తిచేయించాలని చెప్పడం జరిగింది. అలాగే రైతులు సాగు చేసిన బంతిపూట తోటలను పరిశీలించి అక్కడ పురుగుల ఉధృతి తగ్గించి దిగుబడిసాధించేందుకు ట్రైకోడెర్మాను పశువుల ఎరువుతో కలిపి వేయడం వల్ల నాణ్యతతో పాటు సైజు పెరుగుతాయన్నారు. అలాగే వరిపంటలో పాము పొడ, అగ్గితెగులు రాకుండా సూడోమొనాస్ మందును లీటరునీటికి 10 గ్రాములు చొప్పున కలిపి పిచికారి చేయాలన్నారు. అలాగే ఆకుముడత పురుగులకు మందును పిచికారి చేయాలన్నారు. ప్రతి రైతు ఈ సీజన్‌లో పంటలు జాగ్రత్తగాకాపాడుకుంటే మంచి ఆదాయం వచ్చే అవకాశం ఉందని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారిణి శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు తమ పంటలను ఈకేవైసీ చేయించుకోవాలి


ఈకేవైసీ చేయించుకుంటున్న రైతులు

వల్లూరు, సెప్టెంబరు 10 :వల్లూరు మండలం తోళ్లగంగనపల్లె రైతు సేవా కేంద్రంలో ఈ పంట ఈకేవైసీ కార్యక్రమాన్ని కమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి పర్యవేక్షించారు. మండలానికి సంబంధించి ఖరీఫ్ 2024 పంట కాలానికి ఇప్పటి వరకు 4769 ఎకరాలు మండల వ్యాప్తంగా వరి, మినుము, పత్తి తదితర పంటలు సాగు చేయడం జరిగింది. ఇప్పటి వరకు 1628 మంది రైతులకు గాను 4769 ఎకరాలు పంటనమోదు చేయడం, 832 మందికి ఈకేవైసీ చేయడం జరిగిందని తెలిపారు. మండలంలో ఇంకా ఈ పంట నమోదు చేయించుకోని రైతులు ఉన్నట్లయితే త్వరగా మీరైతు సేవా కేంద్రం పరిధిలో ఉన్న అగ్రికల్చర్ అసిస్టెంటు వద్ద పంటనమోదు చేయించుకోవాలని తెలిపారు. అదే విధంగా ఈకేవైసీపీ కూడా చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సాయిజ్యోతి, తోళ్లగంగనపల్లె అగ్రికల్చర్ అసిస్టెంట్ ఇంద్రజ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

నీరు జీవరాశులకు జీవనాధారం

కమలాపురం రూరల్, సెప్టెంబరు 10 :నీరు ప్రాణం ఉన్న ప్రతి జీవికి జీవనాధారమని గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ తులసమ్మ అన్నారు. మంగళవారం స్థానిక అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఏకలవ్య ఫౌండేషన్ మరియు షిర్డిసాయి ఎలక్ట్రికల్ ఆధ్వర్యంలో నీరు దాని ఉపయోగం అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో విద్యార్థులు చాలా మంది పాల్గొని వారి అభిప్రాయాలను చక్కగా రాశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీరు జీవరాశులకు ప్రాణాధారమన్నారు. నీరు లేకపోతే మనుగడే లేదన్నారు. చాలా మంది నీటిని వృధాగా పారబోస్తున్నారని అది చాలా తప్పు అన్నారు. ప్రతి విద్యార్థి నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో పసుపులో చీడపీడల తగ్గింపు

చెన్నూరు, సెప్టెంబరు 10 : పసుపు సాగు చేసేరైతులు ప్రకృతి వ్యవసాయం చేపట్టాలని ఈ పద్ధతుల వల్ల పసుపులో చీడపీడలు తట్టుకుని పంట రాఓగ్యంగా పెరుగుతుందని వ్యవసాయాధికారిణి శ్రీదేవి, ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్టు మేనేజరు ఎస్వీ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోనిబయనపల్లె గ్రామంలో రైతు పుల్లయ్య సాగు చేసిన పసుపుపంటను మంగళవారం అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా పసుపులో ప్రస్తుత పరిస్థితుల్లో చీడపీడలు పెరుగుఉతన్నాయని వాటిని తట్టుకుని పంట బాగుండాలనే ప్రకృతి వ్యవసాయం మేలన్నారు. ఇందుకోసం ఘన జీవామృతం, ద్రవ జీవామృతం తయారీని దాని వాడుకను ఆ రైతులతో పాటు అక్కడకు వచ్చిన పలువురు రైతులకు చెప్పడం జరిగింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో పసుపుకు తెగులు సోకే అవకాశం ఉన్నందున జీవామృతం వాడాలని అలాగే పుల్లటి మజ్జిగ వాడకం తెలిపారు. అనంతరం జీవ ద్రవామృతాలను ఎలా తయారు చేయాలి, ఎలా వాడాలన్నా విషయాలు వివరించారు.

స్టాఫ్ నర్సుపై కేసు నమోదు

కడప (క్రైం), సెప్టెంబరు 10 :కడప నగరం కలెక్టరేట్ వద్ద తలకు పూసుకునే రంగు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన స్టాఫ్ నర్సుపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. కడప రిమ్స్‌లో స్టాఫ్ నర్సుగా పనిచేస్తున్న చిన్నమ్మ సైకాలజిస్ట్ డాక్టరు ప్రేమ పెళ్లి పేరుతో మోసం చేశారంటూ సోమవారం కలెక్టరేట్‌కు వచ్చిందన్నారు. అక్కడ గ్రీవెన్‌సెల్ రీల్ చేయకుండా కలెక్టరేట్ ఆవరణలోనే తలకు పూసుకునే రంగు సేవించి బలన్మరణానికి పాల్పడే యత్నం చేసినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి ఆమెపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి : ఆర్ఎం

కడప (మారుతీనగర్) సెప్టెంబరు 10: బస్సు నడిపేసమయంలో డ్రైవర్ అప్రమత్తంగా ఉండాలని ఆర్టీసీ కడప రీజనల్ మేనేజర్ పొలిమేర గోపాల్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఆర్ఎం కార్యాలయ సమావేశ హాలులో కంప్లైం ట్, డ్యామేజీ, అత్యల్ప ఇంధన పొదుపు చేసే డ్రైవర్లకు నిర్వహించిన ప్రత్యేక శిక్ష ణ తరగతుల్లో ఆయన మాట్లాడుతూ రోడ్డుపై వాహనం నడిపే సమయంలో సెల్‌ఫోన్‌లో మాట్లాడరాదన్నారు. రద్దీ ప్రదేశాల్లో వాహనాలకు డ్యామేజీలు జరగకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు.

ఘనంగా రాహుకాల పూజలు


రాహుకాల పూజలు చేస్తున్న భక్తులు (ఇన్‌సెట్) విజయదుర్గాదేవి

కడప (కల్చరల్), సెప్టెంబరు 10: కడప నగరం బిల్టప్ సర్కిల్ సమీపంలో వెలసిన విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం రాహుకాల పూజలు ఘనంగా నిర్వహించారు. నిమ్మకాయలతో కూడిన రాహుకాల దీపాలను ఆ తల్లి సన్నిధిలో వెలిగించి మొక్కు తీర్చుకున్నారు. జిల్లాలోని భక్తులే కాకుండా రాయలసీమ ఇతర జిల్లాల నుంచి కూడా భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారి ఆలయానికి చేరుకుని రాహుకాల దీపాలను వెలిగించారు. భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ నిర్వాహకుడు దుర్గాప్రసాద్ తెలిపారు.

వివేకానందనగర్ లడ్డూ రూ.2.80 లక్షలు


వేలం పాటలో లడ్డూను సాధించుకున్న లావనూరి రామక్రిష్ణ

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 10 : కడప కార్పొరేషన్ పరిధిలో గల వివేకనంద నగర్‌లో ఏర్పాటు చేసిన వరసిద్ధి వినాయక చవితి ఉత్సవ కమిటీ 7వ వార్షికోత్సవ సందర్భంగా ఏర్పాటు చేసిన లడ్డూకు నిర్వాహకులు వేలం పాట నిర్వహించారు. నెహార్‌కలర్స్ అండ్ కోటింగ్ ప్రైవేటు లిమిటెడ్ జనరల్ మేనేజరు లావనూరి రామక్రిష్ణ రూ. 2.80 లక్షలకు గణేశ్ లడ్డూను దక్కించుకున్నారు. గత మూడేళ్లుగా రామక్రిష్ణ వేలం పాటలో లడ్డూను దక్కించుకుని హ్యాట్రిక్‌ను సాధించారని నిర్వాహకులు తెలిపారు.

వినాయక విగ్రహం వద్ద అన్నప్రసాదం వితరణ


అన్నప్రసాదం అందిస్తున్న రాబిట్ ఫిట్‌నెస్ సెంటరు సీఈఓ సాయిమహేశ్

కడప (ఎర్రముక్కపల్లె), సెప్టెంబరు 10 : కడప నగరం ఎర్ర ముక్కపల్లె వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సంధ్యా సర్కిల్‌లో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహం వద్ద రాబిట్ ఫిట్‌నెస్ కేంద్రం సీఈఓ సాయిమహేశ్ భక్తులకు అన్నప్రసాదం అందించారు.

'మోడల్ స్కూలు అక్రమాలపై విచారణ చేయాలి'

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 10 : రాష్ట్రంలో మోడల్ స్కూల్స్ అక్రమాలపై విచారణ జరిపించాలని ఏపీఎంటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరమణ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. న్యాయస్థానం ఆశ్రయిస్తే అధికారులు వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 163 మోడల్ స్కూల్స్‌లో గత సంవత్సరం అక్టోబరులో పీజీటీలుగా పీజీటీలకు ప్రిన్సిపాళ్లుగా పదోన్నతులు చేపట్టారని తెలిపారు. కానీ పదోన్నతుల్లో చాలా అవకతవకలు జరిగాయన్నారు. 261 పోస్టులను ప్రమోషన్లకు 70 ఈస్ట్ 30 రేషియో ప్రకారం నోటిఫికేషన్ జారీ చేశారన్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ కూడా పూర్తి చేశారన్నారు. అయితే చివరికి 81 మందికి పోస్టులు లేవని రిటర్న్ పంపించారన్నారు. ఆ 81 రెగ్యులర్ పోస్టులల్లో కాంట్రాక్టు వారిని నియమించారని ఆరోపించారు. అసలు మోడల్ స్కూల్స్‌లో 254 జీవో ప్రకారం అన్ని పోస్టులు రెగ్యులర్ ప్రాతిపదికన నియమించాలని గత ప్రభుత్వంలో ఒక ఎంపీ ప్రోద్బలంతో కాంట్రాక్టు నియామకాలు చేపట్టారన్నారు. ఈ నియామకాల్లో ఒక్కో పోస్టుకు లక్షల రూపాయలు చేతులు మారాయని ఆరోపించారు. అసలు కొన్ని సబ్జెక్టుల్లో ఖాళీగా లేకపోయినా కాంట్రాక్టు పోస్టులు ఇచ్చి వారిని వేరే పోస్టుల్లో అగైనిస్టులుగా నియమించాన్నారు. రెగ్యులర్ పోస్టుల స్థానంలో కాంట్రాక్టు వారిని నియమించడం వల్ల 81 మంది రెగ్యులర్ సీజీటీలు, పీజీటీలకు పదోన్నతులు కోల్పోయారన్నారు. ఈ పదోన్నతుల్లో సరైన రూల్స్ కూడా పాటించలేదని అన్నారు. రూల్స్ ప్రకారం పదోన్నతుల్లో రిజర్వేషన్ పాటించి ఎస్సీ ఎస్టీ వారికి ప్రమోషన్లు ఇవ్వాలి కానీ అలా చేయలేదని అన్నారు. 2013లో చేరిన వారిని పక్కనబెట్టి 2015లో చేరిన వారికి పదోన్నతులు కల్పించారన్నారు. ఈ విషయంపై కోర్టును ఆశ్రయించగా వారిని అధికారులువేధిస్తున్నారని ఆరోపించారు. దీనిపై కొత్త ప్రభుత్వం విచారణ జరిపించి తగు చర్యలు తీసుకోవాలని బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

24గంటలూ వైద్యసేవలు అందుబాటులో ఉండాలి

● పీహెచ్‌సీ తనిఖీలో డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు


రోగితో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ నాగరాజు


పెండ్లిమర్రి, సెప్టెంబరు 10: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు 24 గంటలు వైద్య సేవలు అందుబాటులో ఉండాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ నాగరాజు అన్నారు. మంగళవారం మండలంలోని నందిమండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. అత్యవసర మందులు, వైద్యసేవల గురించి ప్రజలనుఅడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలోని ఫార్మసీ, నర్సింగ్ రూమ్, లేబర్ వార్డు, జనరల్ వార్డు పరిశీలించారు. సూపర్వైజర్లు, సీహెచ్ఓ, ఏఎన్ఎమ్‌లకు సమావేశం నిర్వహించారు. కొత్తగా తయారవుతున్న భవనం వారం లోపు హ్యాండ్ ఓవర్ చేసుకోవడం జరుగుతుందన్నారు. నెలకు పది కాన్పుల కేసులు నమోదు కావాలన్నారు. గర్భవతుల నమోదు, గర్భవతులకు అందుతున్నసేవలు, వ్యాధినిరోధక టీకాలు కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. డిఐఓ డాక్టర్ ఉమామహేశ్వర్, ఎపిదామాలజిస్టు ఖాజా మొహిద్దీన్, స్టాటిస్టిక్ ఆఫీసర్ రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

హైరిస్క్ గర్భిణులను గుర్తించండి

కమలాపురం రూరల్, సెప్టెంబరు 10 : మండలపరిధిలోని హైరిస్క్ గర్భిణులను గుర్తించాలని పెద్దచెప్పలి పీహెచ్‌సీ డాక్టర్ జావలి ప్రసన్న తెలిపారు. మండల పరిధిలో బి.పెద్దచెప్పలి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నాడు రెండోరోజు పెద్దచెప్పలి పీహెచ్‌సీ పరిధిలో జరుగుతున్న ప్రధానమంత్రి మాతృత్వ అభియాన్ సురక్షిత ప్రోగ్రామ్‌ను డాక్టర్ జావలి ప్రసూన ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మండలంలోని గర్భిణీ స్త్రీలను గుర్తించి 12 వారాలు నమప్రాధాన్యత గర్భిణీ స్త్రీలకు తెలియజేయడం ల్యాబ్ పరీక్షలు 102, 108 వాహనాల ద్వారా సరైన సమయంలో సరైన చికిత్స అందించాల్సిందిగా సిబ్బందికి తెలిపారు. అదేవిధంగా సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

దారెడ్డి సేవలు మరువలేనివి

● విద్యుత్ శాఖ ఎస్ఈ రమణ



కడప (నాగరాజుపేట), సెప్టెంబరు 10 :విజిలెన్స్ అండ్ ఏపీటీఎస్ విభాగంలో పనిచేస్తూ బదిలీపై వెళ్లిన ఇన్స్‌పెక్టర్ ఆఫ్ పోలీస్ దారెడ్డి భాస్కర్ రెడ్డి సేవలు మరువలేనివని వైఎస్ఆర్ జిల్లా విద్యుత్ శాఖ అధికారి సూపరింటెండెంట్ ఇంజనీరు ఎస్.రమణ అన్నారు. మంగళవారం ఏపీఎస్పీడీసీఎల్ సంస్థలోని విజిలెన్స్ అండ్ ఏపీటీఎస్ విభాగంలో ఇన్స్‌పెక్టర్ ఆఫ్ పోలీసుగా పనిచేసిన దారెడ్డి భాస్కర్‌రెడ్డి వీడ్కోలు సభ నిర్వహించారు. రమణ మాట్లాడుతూ విద్యుత్ చౌర్యాన్ని అరికట్టడంలోనూ, లా అండ్ ఆర్డర్ విషయంలోనూ ఉన్నతమైన ప్రతిభ కనబరిచి పలుమార్లు ప్రతిభా అవార్డులు పొందారని అన్నారు. అనంతరం దారెడ్డి భాస్కర్‌రెడ్డి మాట్లాడారు. ఈ సన్మాన సభలో జిల్లాలోని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు నాగరాజు, నాయక్, రమేశ్, రమణారెడ్డి, విజిలెన్స్ విభాగం డీఈఈలు, ఏఈలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రోడ్డు కోతతో రాకపోకలు బంద్

పెన్నానదిలో జమ్మలమడుగు-వేపరాల మధ్య కొట్టుకుపోయిన రోడ్డు

జమ్మలమడుగు, సెప్టెంబరు 10: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జమ్మలమడుగు నుంచి వేపరాలకు వెళ్లే పెన్నానదిలో రోడ్డు కోతకు గురైంది. జమ్మలమడుగులోని మిరాయిగిరి హైస్కూలు వద్ద నుంచి పెన్నానదిలో వేపరాలకు వెళ్లే దారి కోతకు గురికావడంతో వాహనాలు వెళ్లకుండా వేపరాల సర్కిల్ పెన్నానది వద్ద జమ్మలమడుగులో రోడ్డుకు అడ్డంగా మట్టికుప్పలు, రాళ్లు పెట్టారు. ప్రస్తుతం మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి అధికారులు వరదనీరు విడుదల చేశారు. దీంతో మరింత ఉధృతంగా పెన్నానదిలో నీరు ప్రవాహం జరుగుతోంది. ప్రస్తుతం మైలవరం వెళ్లే ద్విచక్ర వాహనదారులు, ఇతర వాహనదారులు జమ్మలమడుగు నుంచి మోరగుడి, దొమ్మరనంద్యాల



వేపరాల దారి వద్ద వాహనాలు వెళ్లకుండా అడ్డంగా వేసిన రాళ్లు, మట్టి కట్టలు



జమ్మలమడుగు, వేపరాల మధ్య పెన్నానదిలో కోతకు గురైన రోడ్డు

మీదుగా బైపాస్ రోడ్డులో వెళుతున్నారు. వాహనదారులు గమనించి ఆ ప్రాంతంవైపు వెళ్లవద్దని అధికారులు తెలియజేస్తున్నారు. పెన్నానదిలో వరదనీరు విడుదల చేయడం వలన రజకులు, నాపరాళ్ల గనుల్లో పనిచేసే కార్మికులకు ఇబ్బందులు తలెత్తాయి. అదే విధంగా పెన్నానది సమీప ప్రాంతాల ప్రజలు వారి వారి పిల్లలను నదివైపు పంపించవద్దని పలువురు తెలియజేస్తున్నారు. గండికోట జలాశయానికి వరదనీరు చేరడం అక్కడి నుంచి మైలవరం జలాశయానికి విడుదల చేశారు. అక్కడి నుంచి మైలవరం, జమ్మలమడుగు పెన్నానదికి వరదనీరు విడుదల చేశారు. దీంతో సమీపాన ఉన్న రైతాంగానికి నీటి సమస్యలు లేవు. బోర్లకు నీరు బాగా అందడం, పంటపొలాలకు ఇబ్బంది లేకుండా ఉండడం వలన రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వ్యాధినిరోధక టీకాలపై అవగాహన

ప్రొద్దుటూరు , సెప్టెంబరు 10 : ప్రతి ఒక్కరూ వ్యాధినిరోధక టీకాలు వేయించుకోవాలని ప్రొద్దుటూరు టీబీ యూనిట్ సూపర్‌వైజర్ బండి రాజారత్నం పేర్కొన్నారు. మంగళవారం శ్రీనివాస నగర్‌లో వ్యాధి నిరోధక టీకాలపై టీబీ యూనిట్ అధికారులు, సిబ్బంది ఇంటింటికి సర్వే చేపట్టి అవగాహన కల్పించారు. టీకాలపై ఎటువంటి అపోహలు వద్దన్నారు. ప్రభుత్వం వీటిని ఉచితంగా ఇంటివద్దకు తెచ్చి వైద్య సిబ్బంది ద్వారా అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో టీబీ యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో వైద్యులు నిరసన

చాపాడు, సెప్టెంబరు 10: చాపాడు, నక్కలదిన్నె గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్లు రాజేష్‌కుమార్, ఓబులేసు, శ్రీనివాణి, కావ్యమాధురి మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో 85కు వ్యతిరేకంగా ఈ నిరసన చేపట్టినట్లు డాక్టర్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్లు ప్రజలకు సర్వీసు చేస్తూ తమ రిజర్వేషన్ కోటాలో పీజీ చేసినందుకు 50 శాతం అవకాశం ఉందన్నారు. కానీ 85 జీవోతో 50 శాతం నుంచి 15 శాతానికి తగ్గించారన్నారు. దీంతో తమకు అన్యాయం జరిగిందని చెప్పారు. ప్రభుత్వం ఈ జీవోను వెంటనే రద్దు చేయాలని వారు కోరారు.

జీవో నెంబరు 85ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలి

బద్వేలు రూరల్, సెప్టెంబరు 10 : రాష్ట్ర ప్రభుత్వం జీవో 85ను వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వ వైద్యాధికారులు జె.వినయ్‌కుమార్, రాజేశ్, శ్రీవాణి, ఓబులేసు, సంపత్, సాయితేజ మంగళవారం ప్రకనటలో కోరారు. ఈ జీవోల ద్వారా మూడు సంవత్సరాలు సర్వీసు లేకుండా పోతుందన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 10: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించిందని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ అశోక్‌బాబు తెలిపారు. మంగళవారం కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాలో రిలయన్స్ రీటైల్, అమెజాన్, ఏఐఎల్‌డిక్షన్ సంస్థలు పాల్గొన్నాయి. 88 మంది అభ్యర్థులు జాబ్‌మేళాలకు హాజరు కాగా 36 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ప్రభుత్వం జాబ్‌మేళా నిర్వహిస్తుందన్నారు.

'పంట కాలువ ఆక్రమణపై చర్యలు తీసుకోండి'

పోరుమామిళ్ల, సెప్టెంబరు 10 :పంట కాలువలు ఆక్రమిం చిన వారిపై చర్యలు తీసుకోవాలని దమ్మనపల్లె రైతు లు అధికారులకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం వారు మాట్లాడుతూ దమ్మనపల్లెలో తెలుగుగంగ కాల్వ నుంచి పడమటి వైపున దాదాపు 900 మీటర్ల వరకు గతంలో 20 అడుగుల వెడల్పుతో పంట కాల్వ ఉండే దని, ప్రస్తుతం అది పూర్తిగా కుదించుకుపోయింద న్నారు. కాల్వకు వంద ఎకరాలు ఆయకట్టు ఉందని, తెలుగు గంగ ఇరిగేషన్ అధికారులు సర్వే నిర్వహించి ఆక్రమణ లకు గురైన పంట కాల్వలను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై తెలుగుగంగ ఏఈని వివరణ కోరగా పంట కాలువ ఆక్రమించిన విషయం తమ దృష్టికి రాలేదన్నారు. తెలుగుగంగ కాలువ పనులు మర లా ప్రారంభం అయినప్పుడు ఆక్రమణలన్నింటినీ తొలగిస్తామన్నారు.

మొక్కజొన్నలో సస్యరక్షణ చేపట్టాలి

పోరుమామిళ్ల, సెప్టెంబరు 10 : మొక్కజొన్నలో సస్యరక్షణ చేపట్టాలని జిల్లా వనరుల కేంద్రం అధికారులు శివశైల, ఏవో మధు, ఏడీఏ మురళీధర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మల్లేపల్లె, ఇటుకలపాడు, కలసపాడు, చెన్నారెడ్డిపేట గ్రామాల్లో మొక్కజొన్న పంటను పరిశీలించారు. ఆయా మండల ఏవోలు, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

పవిత్రోత్సవాలను విజయవంతం చేయండి

జమ్మలమడుగు, సెప్టెంబరు 10: జమ్మలమడుగు నారాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 12వ తేదీ నుంచి పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. 13వ తేదీ ఉదయం ఆలయంలో అగ్నిపరీక్ష, పవిత్ర ప్రతిష్ఠ కార్యక్రమాలు ఉంటాయన్నారు. 14న పవిత్ర హోమం, పవిత్ర సమర్పణ జరుగుతుందన్నారు. 15న పూర్ణాహుతి, పవిత్ర విసర్జన, ఈ సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారికి గ్రామోత్సవం జరుగుతుందన్నారు.

ఉమ్మడి వనరుల అభివృద్ధికి కృషి చేయాలి



మాట్లాడుతున్న కో-ఆర్డినేటరు లావణ్య

బ్రహ్మంగారిమఠం, సెప్టెంబరు 10 : ఉమ్మడి వనరుల అభివృద్ధికి గ్రామ ప్రజలు కృషి చేయాలని ఫౌండేషన్ ఫర్ ఎకలాజికల్ సెక్యూరిటీ సంస్థ సిబ్బంది క్లస్టర్ కో-ఆర్డినేటరు లావణ్య అన్నారు. మంగళవారం మండల ఉమ్మడి వనరుల అభివృద్ధి సమావేశం స్థానిక వెలుగు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ప్రకృతి సిద్ధంగా ఉన్న ఆస్తులు కొండలు, వాగులు, వంకలు, చెరువులు, చెట్లు అడవులను శ్మశానాలు అంతరించి పోకుండా కాపాడుకోవాలని అందుకు ప్రతి గ్రామంలో ఒక కమిటీ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అనంతరం వెలుగు అసిస్టెంటు ప్రాజెక్టు మేనేజరు జి.ప్రకాశరావు ,26 గ్రామాల గ్రామ ప్రతినిధులు ఫౌండేషన్ సభ్యులు ఓబులేసు, ఎర్రంపల్లి రవి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారామ కల్యాణం



సీతారామ కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

పోరుమామిళ్ల, సెప్టెంబరు 10 : మండలంలోని రంగసముద్రం పంచాయతీ పరిధిలోని రెడ్డినగర్ కాలనీలోని వరసిద్ధివినాయక కోదండ రామస్వామి దేవాలయంలో సీతారామ కళ్యాణం కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఆలయ ప్రథమ వార్షికోత్సవ సందర్భంగా ఉత్సవ విగ్రహాలకు అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సీతమ్మ కోలాట బృందం లక్ష్మీ వేంకటేశ్వర కోలాటబృందం వారిచే కోలాట ప్రదర్శన చేశారు. అనంతరం సీతారామకల్యాణాన్ని ఒంటిమిట్ట అర్చకులచే కన్నులపండువగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ గోవిందరెడ్డి ,రంగసముద్రంసర్పంచ్ చిత్తా రవిప్రకాశ్‌రెడ్డి, ఆలయ ప్రెసిడెంట్ చాపాటి లక్ష్మీనారాయణరెడ్డి, పాలకొలను రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు. సాయంత్రం సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాలతో రథంతో రెడ్డినగర్‌లోని పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.

ఆత్మహత్యల నివారణకు ఆత్మవిశ్వాసం పెంచడమే మార్గం

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 10 : ఆత్మహత్యల నివారణకు మనుషుల్లో ఆత్మవిశ్వాసం పెంచడమే మార్గమని డీసీహెచ్ఎస్ హిమదేవి పేర్కొన్నారు. మంగళవారం ఆత్మహత్యల నివారణదినం సందర్భంగా జిల్లా మెంటల్, హెల్త్ ప్రోగ్రాం ఆధ్వర్యంలో జిల్లా ఆసుపత్రినుంచి గాంధీ రోడ్డు వరకు సాగింది. కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబు, పెథాలజిస్ట్‌డాక్టర్ గోపాల్, సైక్రియాటిస్టు డాక్టర్ కవిత, ప్రసన్న ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రమేశ్, నర్సింగ్, ఫార్మసీ విద్యార్థులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కాలేజీకి నూతన భవనాలు నిర్మించాలి

ఎమ్మెల్యేకి విన్నవించిన కాలేజీ ప్రిన్సిపాల్, లెక్చరర్లు



ఎమ్మెల్యేకి వినతి పత్రం ఇస్తున్న పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 10 : ప్రొద్దుటూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ శిథిలావస్థలో వుందని నూతన భవనాలు మంజూరు చేయించి నిర్మించాలని పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ జింకా అశోక్‌బాబు తదితరులు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డిని కోరారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డిని కలిసి పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ తదితరులు లెక్చరర్లు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 1959లో నిర్మించిన పాలిటెక్నిక్ కాలేజీ పూర్తి శిథిలావస్థకు చేరిందన్నారు. ప్రస్తుతం 1800 వందల మంది విద్యార్థులు కాలేజీలో చదువుతున్నారన్నారు. హాస్టల్ భవనాలు, బోధనతరగతి గదులు, ల్యాబులు, వర్క్‌షాపుల గదులు అన్నీ శిథిలావస్థలో వున్నాయన్నారు. వైసీపీ ప్రభుత్వంలో కాలేజీకి నిధులు మంజూరయి కాంట్రాక్టరు పనులు చేయక ఆ పనులు రద్దయి పోయాయన్నారు. తిరిగి కాలేజీ నూతన భవనాలకు నిధులు మంజూరు చేయించి నిర్మాణా పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేని కోరారు. ఇందుకు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి స్పందిస్తూ విద్యాశాఖ మంత్రి లోకేశ్ కలిసి నిధులు మంజూరు చేయిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో లెక్చరర్లు వీరభద్రారెడ్డి, మంజునాథ్, శ్రావణ్‌కుమార్, సురేశ్‌బాబు, నాగేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

జమ్మలమడుగు, సెప్టెంబరు 10: రోడ్డు భద్రతపై జమ్మలమడుగు అర్బన్ సీఐ లింగప్ప సూచనలు ఇచ్చారు. మంగళవారం జమ్మలమడుగు అర్బన్ పోలీసు స్టేషన్‌లో పట్టణంలోని ఆటో డ్రైవర్లకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో సీఐ మాట్లాడుతూ ఆటోలకు తప్పనిసరిగా సంబంధించిన రికార్డులు ఉండాలన్నారు. ప్రధాన రోడ్లపై ఉన్నట్లుండి ఎక్కడ పడితే అక్కడ ఆపడం, ఇతర వాహనదారులు, బాటసారులకు అసౌకర్యం కల్పించరాదన్నారు. జమ్మలమడుగు పాత బస్టాండులోని ముద్దనూరు రోడ్డు, మార్కెట్‌రోడ్డు, పాత పోలీసు స్టేషన్ సమీపాన రోడ్లపైనే ఆటోలు నిలిపి ఉండడం వలన ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందితోపాటు ట్రాఫిక్‌లో విధులు నిర్వహించే సిబ్బందికి సమస్యలు ఉంటాయన్నారు. ప్రతి ఆటో డ్రైవర్ నిబంధనలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు రామక్రిష్ణ, కల్పన, స్పెషల్‌బ్రాంచ్ పోలీసు సిబ్బంది రవికుమార్, ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు- ఆంధ్రుల హక్కు

బద్వేలు, సెప్టెంబరు 10 : విశాఖ ఉక్కు- ఆంధ్రుల హక్కు అని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి ఇర్ల నాగేష్ పేర్కొన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకై ఏఐటీయూసీ రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపులో భాగంగా పట్టణంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద కార్మికులతో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో మినీలారీ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ అధ్యక్షుడు రవీంద్ర, మున్సిపల్ వర్క్స్ యూనియన్ నాయకులు మధు, నాగేంద్ర, గోపాల్ , తదితరులు పాల్గొన్నారు.

స్టీలు ప్లాంటు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసన..: ఆంధ్రప్రదేశ్‌కు తలమానికంగా ఉన్న విశాఖ స్టీలు ప్లాంటును ప్రైవేటీకరించడం సరికాదని, దానిని నిరసిస్తూ మంగళవారం పట్టణంలోని పూలేవిగ్రహం వద్ద ప్రజా డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా ఆ సంఘం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు షరీఫ్, ఆదిల్ మాట్లాడుతూ మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ స్టీలు ప్లాంటును ప్రైవేటీకరణకు పూనుకోవడం సరికాదన్నారు. ప్రైవేటీకరణను నిలిపేస్తామని హామీ ఇచ్చిన కేంద్ర మంత్రి మూడు మాసాలు కావస్తున్నా పట్టించుకోక పోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ నాయకులు సుబ్బరాయుడు, సి.సుబ్బరాయుడు, పట్టణ ఉపాధ్యక్షులు ఫాతిమా, ఇమ్మానుయేల్, ఆటో యూనియన్ నాయకులు ఖలీల్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖను ప్రైవేటీకరించొద్దు : ఏఐటీయూసీ


ప్రొద్దుటూరు క్రైం, సెప్టెంబరు 10 : విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించొద్దంటూ ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పి.సుబ్బరాయుడు అన్నారు. మంగళవారం సాయంత్రం పట్టణ అధ్యక్షుడు హరి ఆధ్వర్యంలో వాసవి సర్కిల్‌లో నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు నూర్‌బాష, హసేన్‌బాష, సుబ్బయ్య, షరీఫ్, నాగరాజు, సురేష్, నరసింహా పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోండి

బద్వేలు రూరల్, సెప్టెంబరు 10 :పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుని ఆరోగ్యంగా జీవించాలని తొట్టిగారిపల్లె వైద్యాధికారి వినోద్‌కుమార్ తెలిపారు. మండల పరిధిలోని తిరువెంగలాపురం గ్రామంలో మంగళవారం నిర్వహించిన మెడికల్ క్యాంపులో ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రతి గ్రామంలో బ్లీచింగ్ చల్లించి అవసరం అయిన చోట మెడికల్ క్యాంపు నిర్వహిస్తామన్నారు. హెల్త్‌ఎడ్యుకేటరు వెంగయ్య, సీహెచ్‌వో హర్షిత, వైద్యసిబ్బంది జనార్దనరావు, నాగమ్మ, లక్ష్మీదేవి, ఆశాలు పాల్గొన్నారు.

ఘనంగా గణనాథుని నిమజ్జనం





ప్రొద్దుటూరు.. థర్మల్ రోడ్డులోని పెన్నానదిలో నిమజ్జనం చేస్తున్న దృశ్యం, ముద్దనూరులో ఊరేగింపుగా నిమజ్జనానికి తరలివెళుతున్న వినాయకులు

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 10: పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో కొలువుదీరిన గణనాథులను ఉత్సవ కమిటీల నిర్వాహకులు మంగళవారం ఘనంగా నిమజ్జనం నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం వివిధ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో అన్నదానం, ముగ్గుల పోటీలు, ఉట్టికొట్టే కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గణనాథుని విగ్రహాలను ట్రాక్టర్లపై ఉంచి డప్పు వాయిద్యాలు, రంగులు చల్లుకుంటూ నిమజ్జనానికి తరలించారు. ఆర్టీపీపీ రోడ్డులోని పెన్నానది, కామనూరు,చాపాడులోని పెన్నానదిలో నిమజ్జనం చేస్తున్నారు.

ముద్దనూరు..:మండలంలో వినాయక చవితి పండుగ సందర్భంగా కొలువు దీరిన వినాయకులు మంగళవారం నిమజ్జనానికి బయలుదేరాయి. భక్తులు రంగులు జల్లుకుంటూ, బ్యాండ్ వాయిద్యాల మధ్య వినాయకులను ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు.

బద్వేలు రూరల్..: వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా సిద్దవటం రోడ్డులోని బీఎస్ఎన్ఎల్ ఆఫీసు పక్కనే ఉన్న రామాలయం ఆవరణంలో ఏర్పాటు చేసిన వినాయకుని వద్ద మంగళవారం కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అధికసంఖ్యలో పూజల్లో పాల్గొనగా వేద పండితులు మంత్రోచ్చారణల మధ్య కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులందరికీ వినాయక ఉత్సవ కమిటి వారు అల్పాహారం ఏర్పాటు చేశారు.

బద్వేలు..: వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డు త్యాగరాజు కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద ఉంచిన లడ్డూను వేలంపాటలో ఆ వార్డు టీడీపీ ఇన్‌చార్జి శివకుమార్ సతీమణి వెంకటసుధ రూ. 40వేలకు కైవసం చేసుకున్నారు. ఉత్సవ కమిటీ, సిబ్బంది వారిని శాలువా, పూలమాలతో సత్కరించి ఇంటివరకు మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లారు.

బ్రహ్మంగారిమఠం..: మండలంలోని సుగాలితాండ గ్రామంలో వినాయకుని మూడురోజులపాటు పూజలు నిర్వహించి మంగళవారం గ్రామస్థుల ఆధ్వర్యంలో వినాయక విగ్రహాన్ని వైభవంగా గ్రామోత్సవం చేపట్టారు. ఈ గ్రామోత్సవంలో యువకులు, మహిళలు చిందులతో డీజే సాంగ్‌లతో గ్రామోత్సవం వైభవంగా కొనసాగింది.



బద్వేలులో వేలంపాటలో దక్కించుకున్న లడ్డూతో భక్తురాలు





జి.మఠంలో కోలాటం వేస్తున్న మహిళలు, బద్వేలులో కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు